RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్ : పి. సైదులు, సంపుటి : 02 సంచిక : 357 మంగళవారం 18-11-2025 పేజీలు : 8

## సౌదీలో హైదరాబాద్‌వాసుల దుర్మరణం..

# సంతాపం తెలిపిన కేసీఆర్



**హైదరాబాద్ :** సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో తెలంగాణ వాసులు మరణించడం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉమ్రా యాత్రలో భాగంగా మక్కా నుంచి మదీనా వెళుతున్న బస్సు, అగ్ని ప్రమాదానికి గురై అందులో ప్రయాణిస్తున్న 42 మంది ప్రాణాలు కోల్పోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి సంబంధిత చర్యలు చేపట్టాలని కోరారు.



# సీఎం పదవికి నీతీశ్ రాజీనామా

## - 20న కొలువుదీరనున్న కొత్త ప్రభుత్వం

- 35 నుంచి 36 మంది మంత్రులు ఉండే అవకాశం

**బిహార్ :** బిహార్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈ మేరకు నీతీశ్ సీఎం పదవికి రాజీనామా చేశారు. నవంబరు 20న నూతన ప్రభుత్వం కొలువుదీరనుంది. ఆ రోజున నీతీశ్ కుమార్ మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకానున్నారు. 35 నుంచి 36 మంది మంత్రులు ఉండే అవకాశం ఉందని కేంద్ర మంత్రి, హిందుస్తాన్ అవామీ మోర్చా-ఎస్ అధిపతి జితన్ రామ్ మాఝీ చెప్పారు.
బీజేపీ నుంచి 16 మంది మంత్రులు, జేడీయూ నుంచి 14 నుంచి 15 మంది, లోక్‌జనశక్తి రామ్ విలాస్ పార్టీ నుంచి ముగ్గురు ఉంటారని మాఝీ వెల్లడించారు. హిందుస్తాన్ అవామీ మోర్చా-ఎస్ నుంచి ఒకరు, రాష్ట్రీయ లోక్ మార్చ్ నుంచి మరొకరు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశముందని కేంద్ర మంత్రి మాఝీ వివరించారు. ప్రభుత్వ ఏర్పాటుపై బీజేపీ బిహార్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా ఉన్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో మాఝీ ఇప్పటికే చర్చలు జరిపారు. రాష్ట్రీయ లోక్ మోర్చా అధ్యక్షుడు ఉపేంద్ర కుష్వాహ కూడా

మిగతా 2లో

## డిసెంబర్ రెండో వారంలో

# స్థానిక సంస్థల ఎన్నికలు..

- స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ప్రారంభం - బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై చర్చ
- సౌదీ అరేబియాలో బస్సు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు సంతాపం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపు!
- సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం
- బీసీ రిజర్వేషన్ల అంశంలో తదుపరి కార్యాచరణపై చర్చ
- న్యాయ నిపుణుల అభిప్రాయాలతో రెండ్రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం



**హైదరాబాద్ :** సౌదీ అరేబియాలో బస్సు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు మంత్రివర్గం సంతాపం తెలిపింది. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యే, మైనార్టీ విభాగానికి చెందిన ఓ అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీకి పంపించాలని సూచించింది. చనిపోయిన వారి మృతదేహాలకు మత సంప్రదాయం ప్రకారం సౌదీ అరేబియాలోనే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించింది. బాధిత కుటుంబ సభ్యులను ఒక్కో కుటుంబానికి ఇద్దరు చొప్పున తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.

స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల పెంపుపై నిర్ణయం తీసుకునేందుకు ఈ నెల 23న మరోసారి సమావేశం కావాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. న్యాయ నిపుణులతో చర్చించి, వారి అభిప్రాయాలతో రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను మంత్రివర్గం ఆదేశించింది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రిమండలి గురువారం సమావేశమై పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించింది. రాష్ట్రంలో హ్యామ్ విధానంలో మొదటి దశలో రూ.10,547 కోట్లతో 5,566 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇద్దరికన్నా ఎక్కువ సంతానం ఉన్న వారు స్థానిక సంస్థల్లో పోటీ చేయరాదన్న నిబంధనను తొలగించాలని కేబినెట్ తీర్మానించింది. రాష్ట్రంలో జనాభా నియంత్రణ పకడ్బందీగా అమలవుతున్నందున, ఇద్దరు పిల్లల నిబంధన అవసరం లేదని మంత్రివర్గం అభిప్రాయపడింది.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపు!**

మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే

మిగతా 2లో

సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ప్రారంభమైంది. స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజాపాలన వారోత్సవాల తరువాత ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఆ తరువాత ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. పత్తి కొనుగోళ్లలో కేంద్ర ప్రభుత్వ విధానాలు, సీసీఐ విధించిన కొత్త నిబంధనలు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. సీసీఐ కొత్త నిబంధనలను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తప్పుపట్టిన విషయం తెలిసిందే.గిగ్ వర్కర్ల బిల్లు : తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్ల బిల్లు కేబినెట్ ఆమోదించింది. గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమం బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

## హైదరాబాద్‌లో పెను విషాదం నింపిన

# సౌదీ బస్సు ప్రమాదం..

- ఒకే కుటుంబానికి చెందిన 18 మంది దుర్మరణం
- మృతుల్లో నసీరుద్దీన్, భార్య, ఇద్దరు కుమారులు, కోడళ్లు, ఆరుగురు చిన్నారులు.. నసీరుద్దీన్ రైల్వే రిటైర్డ్ ఉద్యోగి.. వచ్చే వారం హైదరాబాద్‌కి రావాల్సి ఉంది..
- ఎంబసీ, విదేశాంగ మంత్రులతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది..
- 18 మంది అంత్యక్రియలు మక్కాలోని మదీనాలోనే జరుగుతాయి.. అక్కడే జరపమని ప్రభుత్వానికి చెప్పాం: నసీరుద్దీన్ బంధువులు



**సౌదీఅరేబియా :** సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది మృతుల వివరాలు అందుతున్నాయి. చనిపోయిన వారిలో విద్యానగర్ నల్లకుంటకు చెందిన రైల్వే రిటైర్డ్ ఉద్యోగి నసీరుద్దీన్(65) కుటుంబంలోని 18 మంది దుర్మరణం పాలయ్యారు. వీరిలో నసీరుద్దీన్, ఆయన భార్య ముగ్గురు కుమార్తెలు, కుమారులు, కోడళ్లు వారి పిల్లలు అంతా కలిపి 18 మంది మృత్యువాత పడ్డారు. వీరిలో 10మంది పిల్లలు ఉన్నారు.

**నసీరుద్దీన్ ఇంటికి టీపీసీసీ చీఫ్ :**
విద్యానగర్‌లోని నసీరుద్దీన్ ఇంటికి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ వెళ్లి వారి బంధువులను ఓదార్చారు. ఒకే కుటుంబంలో 18 మంది మృతి చెందడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంఐఎం ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ నసీరుద్దీన్ కూడా మృతుల బంధువులను పరామర్శించారు.

**ఒకే కుటుంబానికి చెందిన 18 మంది దుర్మరణం**
**- సౌదీ ప్రమాదంలో వెలుగుచూసిన విషాదం**

మంత్రి అజారుద్దీన్ సారథ్యంలో సౌదీకి : సౌదీ బస్సు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు రూ. 5 లక్షల

మిగతా 2లో



# నిర్ణయం మీరు తీసుకుంటారా..!! మమ్మల్ని తీసుకోమంటారా..!!

## తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పై సుప్రీకోర్టు ఆగ్రహం..

**హైదరాబాద్:** బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల పై బీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేయగా.. మూడు నెలల గడువుతో నిర్ణయం తీసుకోవాలని గతంలోనే స్పీకర్ కు సర్వోన్నత న్యాయస్థానం సూచనలు చేసింది. ఆ సమయం పూర్తయినా నిర్ణయం తీసుకోకపోవటంపై బీఆర్ఎస్ మరో సారి సుప్రీంలో కోర్టు ధిక్కరణ పిటీషన్ దాఖలు చేసింది. దీని పైన విచారణ సమయంలో స్పీకర్ కు సుప్రీం కీలక ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ స్పీకర్ కు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ ఇచ్చింది. ఎమ్మెల్యేల అనర్హత పైన రోజు వారీ విచారణ చేసి నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. ఎమ్మెల్యేల పైన మూడు నెలల్లోగా విచారణ పూర్తి

మిగతా 2లో



# 21వేల సినిమాలు, 50 లక్షల మంది డేటా

- 'ఐబొమ్మ' రవి గురించి సంచలన విషయాలు వెల్లడించిన సీపీ
- ఐబొమ్మ కేసులో వివరాలను మీడియాకు వెల్లడించిన సజ్జనార్
- నిందితుడి వద్ద 21వేల సినిమాలు పైరసీ ద్వారా ఇమ్మడి రవి రూ.20 కోట్లు సంపాదించాడని వెల్లడి
- ప్రకటన విడదల చేసిన ఐబొమ్మ

2



2లో

ఢిల్లీ పేలుడు కారకులు పాతాళ లోకంలో దాక్కున్నా తీసుకువచ్చి

# కఠినంగా శిక్షిస్తాం

- అమిత్ షా

## ఉగ్రవాదులు, వారి మద్దతుదారులను

# భారత్ ఒకేలా చూస్తుంది

### - భారత ఆర్మీచీఫ్

- భారత్ ఎలాంటి బెదిరింపులకు లొంగదు
- భారత పురోగతికి అడ్డంకులు సృష్టించాలని చూస్తే వదిలేది లేదు
- భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది



2లో



2లో

# రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై 500 శాతం సుంకాలు : ట్రంప్

- రష్యాతో వ్యాపారం చేస్తే అతి తీవ్ర ఆంక్షలు విధిస్తామన్న ట్రంప్
- సెనెట్ పరిశీలనలోని బిల్లుపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు
- టార్గెట్‌లో భారత్, చైనా, బ్రెజిల్

## బంగ్లా మాజీ ప్రధాని హసీనాకు

# మరణ శిక్ష

### - ఢాకా కోర్టు సంచలన తీర్పు

- మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారన్న అభియోగాలపై దోషిగా తేల్చిన ట్రైబ్యునల్



**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఢాకాలోని ప్రత్యేక ట్రైబ్యునల్ మరణ శిక్ష విధించింది. ఆమెపై దాఖలైన హత్యానేరం కేసుల్లో ఈ మేరకు తీర్పు వెలువరించింది. ఇదే కేసులో బంగ్లాదేశ్ మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్‌కు కూడా మరణ శిక్ష విధించిన ప్రత్యేత ట్రైబ్యునల్, అప్పటి పోలీస్ చీఫ్ చౌధురి అబ్దుల్లాకు ఐదేళ్ల కారా గార శిక్ష విధించింది. మానవత్వం లేకుండా నేరాలకు పాల్పడ్డారన్న

మిగతా 2లో

# డిసెంబర్ రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికలు..

అంశంపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించింది. ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునేందుకు అన్ని కోణాల్లో లోతుగా అధ్యయనం చేసేందుకు సీఎస్ నేతృత్వంలో ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.
అధికారుల కమిటీ నివేదిపై చర్చించి కేబినెట్ సబ్ కమిటీ ఇచ్చే సిఫారసుల ఆధారంగా మెట్రో స్వాధీనంపై తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గం తీర్మానించింది. వానాకాలం సీజన్‌లో పండించిన ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. కేంద్రం 50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకే అంగీకరించినందున, మరో 15 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని కేంద్రాన్ని కోరాలని మంత్రివర్గం నిర్ణయించింది.
"రాష్ట్రంలో కొత్తగా 3 వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రైతులు పండించిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని నిర్ణయించాం. కేంద్రం కొనుగోలు చేసినా, చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది."

– పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మంత్రి

**కొత్తగా మూడు వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు ఆమోదం :** హుజూర్‌నగర్, కొడంగల్, నిజామాబాద్‌లో కొత్తగా మూడు వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కానున్నందున డిసెంబరు 1 నుంచి 9 వరకు "ప్రజా పాలన –ప్రజా విజయోత్సవాల"ను నిర్వహించాలని నిర్ణయించింది.
నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయానికి అదనంగా 7 ఎకరాల భూమిని కేటాయించే ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నల్సార్ వర్సిటీ అడ్మిషన్లలో తెలంగాణ స్థానికుల కోటాను 25 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని తీర్మానం చేసింది.
సికింద్రాబాద్ ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం వినియోగించుకుంటున్న రక్షణ శాఖ భూములకు ప్రత్యామ్నాయంగా 435 ఎకరాలను అప్పగించాలని మంత్రిమండలి తీర్మానించింది.
శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికయ్యే వ్యయంలో మూడో వంతు రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు కేబినెట్ అంగీకరించింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన ఎస్ఎల్‌పీని సుప్రీంకోర్టు కొట్టివేసిన అంశంపై మంత్రులు చర్చించారు. న్యాయ నిపుణులతో చర్చించి తదుపరి కార్యాచరణ ఖరారు చేయాలని నిర్ణయించారు.

**కేబినెట్ సమావేశానికి హాజరు కాని మంత్రి కొండా సురేఖ :** ఓఎస్డీ సుమంత్ తొలగింపుపై అసంతృప్తితో ఉన్న మంత్రి కొండా సురేఖ, కేబినెట్ సమావేశానికి హాజరు కాలేదు.
మంత్రివర్గ భేటీ సాగుతున్న సమయంలోనే ఏఐసీసీ ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌ను కొండా సురేఖ కలిశారు. మంత్రివర్గ సమావేశంలో కొండా సురేఖ అంశంపై చర్చ జరగలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. కొండా సురేఖ ఎపిసోడ్‌ను సముద్రంలో తుఫానులా సృష్టించారని, అది టీ కప్పులో తుఫానేనని వ్యాఖ్యానించారు.

# హైదరాబాద్‌లో పెను విషాదం నింపిన సౌదీ బస్సు ప్రమాదం..

పరిహారం ఇవ్వాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. మంత్రి అజారుద్దీన్ సారథ్యంలో ప్రభుత్వ ప్రతినిధి బృందం సౌదీ వెళ్లనుంది. ఈ బృందంలో ఎంఐఎం ఎమ్మెల్యే, మైనారిటీ విభాగానికి చెందిన అధికారి ఉండనున్నారు. మృతదేహాలకు సౌదీలోనే అంత్యక్రియలు చేయించాలని నిర్ణయం తీసుకున్నారు. కుటుంబానికి ఇద్దరిని చొప్పున తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అటు బీఆర్ఎస్ తరపున ఆ పార్టీ నేతల బృందం కూడా సౌదీ వెళ్లాలని నిర్ణయించింది.
"పెద్ద విషాదం ఇది. మక్కాలో ఉమ్రకోసం వెళ్లారు. అది పూర్తి అయిన తర్వాత మదీనా వెళ్లాల్సి ఉంది. మహ్మద్ ప్రవక్త తీర్థయాత్రకు వెళ్తారు. వెళ్లే దారిలోనే ఈ దుర్ఘటన జరిగింది. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో మంటలు వ్యాపించి అందరూ సజీవదహనం అయ్యారు. అక్కడ అన్నీ ఆటోమెటిక్ వాహనాలు ఉంటాయి. ఒక్కసారి డోర్ క్లోజ్ అయితే మళ్లీ ఓపెన్ కాదు. నసీరుద్దీన్‌కు చెందిన కుటుంబంలో మొత్తం 18 మంది చనిపోవడం బాధాకరం" –నసీరుద్దీన్ బంధువు

**డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతోనే :** మక్కా యాత్రికులతో వెళ్తోన్న బస్సును డీజిల్ ట్యాంకర్ ఢీకొనడంతో సౌదీ అరేబియాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మక్కా యాత్రను ముగించుకొని మదీనా వెళ్తుండగా సోమవారం తెల్లవారుజామున 1.30 గంటల ప్రాంతంలో (భారత కాలమానం ప్రకారం) ఈ ఘోరమైన ఘటన జరిగింది. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనగానే మంటలు చెలరేగి వేగంగా బస్సు మొత్తానికి వ్యాపించాయి. ప్రమాద సమయంలో యాత్రికులంతా నిద్రలో ఉండటంతో మృతుల సంఖ్య ఎక్కువగా 45కు చేరింది. 20 మంది మహిళలు, 11 మంది చిన్నారులు సహా మొత్తం 45 మంది సజీవ దహనమయ్యారు.

**నల్లకుంటలో నసీరుద్దీన్ నివాసం సంతాపం తెలిపిన ప్రముఖులు :** రోడ్డు ప్రమాద ఘటనపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మదీనాలో భారత పౌరులకు జరిగిన ప్రమాదంపై తీవ్ర సంతాపం తెలిపారు. ప్రభావిత కుటుంబాలకు రియాద్‌లోని ఎంబసీ, జెడ్డాలోని కాన్సులేట్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నాయని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. అలాగే మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆయన ప్రార్థించారు.

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన అసదుద్దీన్ :** సౌదీ రోడ్డు ప్రమాద ఘటనపై హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రియాద్‌లో భారత ఎంబసీతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు.
ప్రమాద ఘటనపై మరిన్ని వివరాలు సేకరించాలని వారిని కోరినట్లు చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన రెండు ట్రావెల్ ఏజెన్సీలతోనూ కాంటాక్ట్ అయినట్లు తెలిపారు.

# 21వేల సినిమాలు, 50 లక్షల మంది డేటా

**హైదరాబాద్:** పైరసీతో సినీ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని సీపీ సజ్జనార్ తెలిపారు. దీన్ని కట్టడి చేయడంలో భాగంగానే ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అతడిపై ఐటీ(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం) యాక్ట్, కాపీ రైట్ యాక్ట్ కింద మరో 4 కేసులను నమోదు చేసినట్లుగా వెల్లడించారు. 'పైరసీకి సంబంధించి అంతకు ముందు ప్రశాంత్, శివరాజ్‌ను కూడా అరెస్టు చేశామని సజ్జనార్ చెప్పారు. ఇమ్మడి రవి సమాజానికి చాలా నష్టం చేకూర్చాడన్నారు. పైరసీ ద్వారా నష్టం చేయడమే కాకుండా బెట్టింగ్ యాప్‌లను కూడా ప్రమోట్ చేస్తున్నాడని సీపీ తెలిపారు. దీంతో బెట్టింగ్ భూతానికి చాలా మంది బలయ్యారన్నారు. ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేస్తే మరో కొత్త సైట్‌ను నిందితుడు తయారు చేశాడని వివరించారు. ఇలా 65 మిర్రర్ వెబ్‌సైట్లు నిర్వహించాడని ఆయన వెల్లడించారు. అంతకు ముందు సజ్జనార్‌ను సినీ రంగ ప్రముఖులు కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.

**నిందితుడి హార్డ్ డిస్క్‌లో 21 వేల సినిమాలు :** 21 వేల సినిమాలు ఇమ్మడి రవి హార్డ్ డిస్క్‌లో ఉన్నాయని సీపీ సజ్జనార్ వెల్లడించారు. 1972లో విడుదలైన గాడ్‌ఫాదర్ నుంచి మొన్న వచ్చిన ఓజీ సినిమా వరకు అందులో ఉన్నాయన్నారు. రూ.20 కోట్లు పైరసీ ద్వారా సంపాదించాడని ఆయన వివరించారు. అందులో రూ.3 కోట్లు సీజ్ చేశామని సీపీ తెలిపారు. 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా రవి వద్ద ఉందని సీపీ వెల్లడించారు. ఇంత డేటా అతడి వద్ద ఉండటం ప్రమాదకరమన్నారు. దీన్ని సైబర్ నేరగాళ్లు వాడుకునే అవకాశం ఉందని సజ్జనార్ చెప్పారు.

**21వేల సినిమాలు, 50 లక్షల మంది డేటా – 'ఐబొమ్మ' రవి గురించి సంచలన విషయాలు వెల్లడించిన సీపీ**

%పోలీసులు వెంటపడ్డాక దేశ పౌరసత్వం వదులుకున్నాడు : ఇమ్మడి రవి స్వస్థలం ఏపీలోని విశాఖపట్నమని, బీఎస్సీ కంప్యూటర్స్ చదివాడని సజ్జనార్ తెలిపారు. అతడు వేరే పేర్లతో మహారాష్ట్రలో డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డులను తీసుకున్నాడని ఆయన వివరించారు. నిందితుడు మొదటి నుంచి నేర ప్రవృత్తితో ఉన్నాడన్నారు. సినీరంగం అప్రమత్తమై ఫిర్యాదు చేసినప్పుడు పోలీసులు అతడి వెంట పడ్డారని సజ్జనార్ వెల్లడించారు. దీంతో భారత పౌరసత్వాన్ని వదిలి కరేబియన్ దీవుల్లో ఉన్న సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ దేశ పౌరసత్వం తీసుకున్నాడని వివరించారు. ఫ్రాన్స్‌లో ఉంటూ వివిధ దేశాలు తిరిగేవాడన్నారు. 2019లో ఐబొమ్మ ప్రారంభించి 21 వేల సినిమాలు పైరసీ చేసినట్లుగా సజ్జనార్ తెలిపారు. అమెరికా, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్‌లో సర్వర్లను పెట్టాడన్నారు. 110 డొమైన్స్ కొనుక్కున్నాడని చెప్పారు. ఒకటి బ్లాక్ చేస్తే మరొకటి ఓపెన్ చేస్తూ పైరసీ సినిమాలు విడుదల చేశాడని సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఈ రాకెట్‌లో ఉన్న మిగతా వాళ్లను కూడా బయటకు తీసుకువస్తామని ఆయన స్పష్టం చేశారు.
" పైరసీ వల్ల సినీరంగానికి తీవ్ర నష్టం జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా పీడిస్తున్న సమస్య ఇది. ఎలాగైనా పైరసీని అరికట్టాలనే సంకల్పంతో పోలీసులు పనిచేయడం జరిగింది. నిందితుడిపై మరో నాలుగు కేసులు ఉన్నాయి. పైరసీతో పాటు బెట్టింగ్ యాప్‌ల వల్ల సమాజానికి తీవ్ర నష్టం జరుగుతోంది. నిందితుడు దాదాపు 65 మిర్రర్ వెబ్‌సైట్‌లను నడిపేవాడు. నిందితుడి హార్డ్‌డిస్క్‌లో 21 వేల సినిమాలు ఉన్నాయి. నిందితుడి వద్ద 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డాటా ఉంది. అది సైబర్ నేరాలకు గురయ్యే అవకాశం ఉంది. ప్రజలు పైరసీ సినిమాలు చూడవద్దని కోరుతున్నాం"

– సజ్జనార్, హైదరాబాద్ సీపీ

**అలాంటి మీమ్స్ చేస్తే కఠిన చర్యలు :** ఎవరో ఇచ్చిన సమాచారంతో నిందితుడు ఇమ్మడి రవిని పట్టుకున్నామనేది అబద్ధమని తాము సొంతగానే పట్టుకున్నట్లు సజ్జనార్ స్పష్టం చేశారు. నిందితులు ఎక్కడ ఉన్నా పోలీసులు పట్టుకుంటారని వివరించారు. సహకరించిన సినీప్రముఖులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తమ దగ్గర 5 కోట్ల మంది ప్రజల డేటా ఉందని బెదిరించిన వారు కూడా ఉన్నారన్నారు. దమ్ముంటే పట్టుకోండని సవాలు చేసిన వారిని కూడా పట్టుకున్నామన్నారు. నిందితుడు ఇమ్మడి రవి అరెస్టు తర్వాత చాలా మంది మీమ్స్ వేశారని, ఇకపై ఇలాంటి వాటిని చేస్తే చర్యలు తీసుకుంటామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు.

**ప్రకటన విడదల చేసిన ఐబొమ్మ :** ఐబొమ్మ, బప్పం టీవీ వెబ్‌సైట్ల నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టైన నేపథ్యంలో ఐ బొమ్మ ప్రకటన విడుదల చేసింది. తమ సేవలను శాశ్వతంగా నిలిపివేశామని వెబ్‌సైట్లో పేర్కొంది. మీకు ఇటీవల తమ గురించి తెలిసి ఉండొచ్చని, లేదంటే మొదటి నుంచి నమ్మకమైన అభిమానై ఉండొచ్చని తెలిపారు. ఏదేమైనా మీ దేశంలో తమ సేవ శాశ్వతంగా నిలిపివేశామని చెప్పేందుకు చింతిస్తున్నామని అన్నారు. అందుకు క్షమాపణలు కోరుతున్నామని బొమ్మ ప్రకటనలో వెల్లడించింది.

# రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై 500 శాతం సుంకాలు : ట్రంప్

**అమెరికా :** రష్యాతో వ్యాపార, వాణిజ్యాలు చేస్తున్న అన్ని దేశాలపై అతి తీవ్ర ఆంక్షలను విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరించారు. రష్యా నుంచి ముడి చమురును కొనే, దాన్ని రీసేల్ చేసే దేశాలపై 500 శాతం దాకా సుంకాలను విధిస్తామని ఆయన వెల్లడించారు. ఈమేరకు కఠిన ప్రతిపాదనలతో కూడిన ఓ బిల్లును అధికార రిపబ్లికన్ పార్టీ అమెరికా సెనేట్‌లో ప్రవేశపెట్టిందని తెలిపారు. ఒకవేళ ఆ బిల్లుకు అమెరికా కాంగ్రెస్ ఆమోద ముద్ర లభిస్తే, తాను స్వాగతిస్తానని ట్రంప్ చెప్పారు. 500 శాతం సుంకాలను ఎదుర్కొనే దేశాల జాబితాలో ఇరాన్‌ను చేర్చాలని తాను సూచించానని, తప్పకుండా ఆ దేశాన్ని జాబితాలో చేరుస్తారని పేర్కొన్నారు. ఫ్లోరిడా నుంచి వాషింగ్టన్‌కు బయలుదేరే ముందు విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

**'శాంక్షనింగ్ రష్యా యాక్ట్ ఆఫ్ 2025'**

రష్యా వాణిజ్య భాగస్వాములపై 500 శాతం సుంకాలను విధించే ప్రతిపాదనతో కూడిన బిల్లును అధికార రిపబ్లికన్ పార్టీ సెనెటర్ లిండ్సే గ్రాహం, విపక్ష డెమొక్రటిక్ పార్టీ సెనెటర్ రిచర్డ్ బ్లూమెంథాల్ కలిసి అమెరికా సెనెట్‌లో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు పేరు 'శాంక్షనింగ్ రష్యా యాక్ట్ ఆఫ్ 2025'. 85 మంది సెనెటర్ల కనీస మద్దతుతో ఈ బిల్లును సెనెట్‌లో చర్చకు పెట్టారు. దీనికి సెనెట్‌లోని అత్యంత కీలకమైన 'విదేశీ సంబంధాల కమిటీ' ఏకగ్రీవ మద్దతు లభించే అవకాశాలు ఉన్నాయి. ఈ బిల్లుకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం లభిస్తే, రష్యా వాణిజ్య భాగస్వాములపై 500 శాతం సుంకాలను విధించే అధికారం ప్రెసిడెంట్ ట్రంప్ చేతికొస్తుంది. ఈ అధికారంతో ప్రధానంగా చైనా, భారత్‌లను ట్రంప్ లక్ష్యంగా చేసుకునే అవకాశాలు ఉన్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఇక ఇరాన్, ఉత్తర కొరియాలాంటి దేశాలు ఎలాగూ ఆ జాబితాలో ఉంటాయి. ఇప్పటికే ఉక్రెయిన్‌లోని చాలా భూభాగాన్ని రష్యా ఆర్మీ ఆక్రమించుకుంది. ఇప్పుడు తూర్పు ఉక్రెయిన్‌లోని కీలకమైన రైల్వే హబ్ 'పొక్రోవ్స్క్'ను స్వాధీనం చేసుకోవడంపై పుతిన్ సేనలు ఫోకస్ పెట్టాయి. గత కొన్ని రోజులుగా ఉక్రెయిన్‌పై భీకర వైమానిక దాడులను రష్యా చేస్తోంది. మరోవైపు ఉక్రెయిన్ కూడా రష్యాలోని ముడి చమురు రిఫైనరీలపై దాడులు మొదలుపెట్టింది.
ఈ యుద్ధం తీవ్రరూపు దాలుస్తున్న తరుణంలో రష్యా మిత్రదేశాలపై 500 శాతం సుంకాలను విధించే అధికార దండాన్ని సిద్ధం చేసుకోవడంపై ట్రంప్ ఫోకస్ చేస్తుండటం గమనార్హం.

**అలస్కా భేటీ తర్వాత కూడా ఆగని యుద్ధం**

కొన్ని నెలల క్రితమే అమెరికాలోని అలస్కా వేదికగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ట్రంప్ భేటీ అయ్యారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించాలని, శాంతిని నెలకొల్పాలని సూచించారు. ఈ భేటీ తర్వాత ఉక్రెయిన్‌పై రష్యా దాడుల తీవ్రత మరింత పెరిగింది. దీంతో రష్యాతో, రష్యా మిత్రదేశాలతో కఠినంగా వ్యవహరిస్తేనే పరిస్థితులు అదుపులోకి వస్తాయనే అభిప్రాయానికి ట్రంప్ వచ్చారని పరిశీలకులు అంటున్నారు. ఈక్రమంలోనే రష్యాను ఆర్థిక మూలాలను దెబ్బతీసే ప్రయత్నాలను వేగవంతం చేశారని చెబుతున్నారు. 500 శాతం సుంకాల అంశాన్ని ఈ కోణంలోనే చూడాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

**చైనా, భారత్, బ్రెజిల్‌లపై భారీ సుంకాలు**

ఈ ఏడాది జులైలో సెనెటర్లు లిండ్సే గ్రాహం(రిపబ్లికన్ పార్టీ), రిచర్డ్ బ్లూమెంథాల్ (డెమొక్రటిక్ పార్టీ) ఓ సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. రష్యా వాణిజ్య భాగస్వాములుగా ఉన్న చైనా, భారత్, బ్రెజిల్‌లపై భారీ సుంకాలను విధిస్తేనే, రష్యా –ఉక్రెయిన్ యుద్ధం ఆగుతుందని వారు అభిప్రాయపడ్డారు. రష్యా మిత్రదేశాలను సుంకాలతో కట్టడి చేస్తేనే, ఉక్రెయిన్‌పై దాడులు చేస్తున్న రష్యా సైన్యానికి ఆర్థిక వనరుల కొరత ఏర్పడుతుందన్నారు. రష్యా ఆర్థిక మూలాలను బలహీనపరిస్తేనే ఉక్రెయిన్‌పై దాడుల తీవ్రత తగ్గుతుందనే భావనలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఉంది. ప్రస్తుతం పలు దేశాలు వాణిజ్యం ద్వారా రష్యాకు ఆర్థిక వనరులను సమకూరుస్తూ పరోక్షంగా ఉక్రెయిన్ యుద్ధంలో భాగస్వామ్యం అవుతున్నాయని అమెరికా సర్కారు ఆరోపిస్తోంది. ఇప్పటికే భారత్‌పై 50 శాతం దిగుమతి సుంకాలను అమెరికా విధిస్తోంది. ఇందులో 25 శాతం సుంకాన్ని, కేవలం రష్యా నుంచి ఆయిల్‌ను కొంటున్నందుకే విధిస్తోంది. అయితే ఈ ఏడాది అక్టోబరులో ట్రంప్ మరో కీలక ప్రకటన చేశారు. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలును భారత్ చాలావరకు తగ్గించిందని ఆయన చెప్పారు. ఆ మేరకు భారత్‌పై విధించిన సుంకాలను తగ్గిస్తామన్నారు. ఓవైపు అమెరికా, మరోవైపు ఐరోపా దేశాలు రష్యాపై ఆంక్షలను అమలు చేస్తున్నాయి. అయినప్పటికీ ఉక్రెయిన్‌పై దాడులను రష్యా ఆపడం లేదు. ఆసియాలోని పలు పెద్ద దేశాలతో వాణిజ్య సంబంధాల వల్లే రష్యా ఆర్థిక మూలాలు ఇప్పటికీ బలంగా ఉన్నాయని పరిశీలకులు అంటున్నారు. ఇప్పుడు ఆ వాణిజ్య సంబంధాలను అడ్డుకునే ప్రయత్నాల్లో అమెరికా ఉంది. ఈ దిశగా అగ్రరాజ్యం చేస్తున్న ప్రయత్నాలు సఫలం అవుతాయో, కావో వేచిచూడాలి.

# ఢిల్లీ పేలుడు కారకులు పాతాళ లోకంలో దాక్కున్నా తీసుకువచ్చి కఠినంగా శిక్షిస్తాం: అమిత్ షా

## - ప్రధాని మోదీ నేతృత్వంలో ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో సహా పెకిలించి వేస్తామని హామీ

**ఢిల్లీ:** ఢిల్లీ ఎర్రకోట బాంబు పేలుడు కారకులు ఎక్కడున్నా పట్టుకుంటామని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. నిందింతులు పాతాళ లోకంలో దాక్కున్నా తీసుకువచ్చి కఠిన శిక్షలు విధిస్తామని వెల్లడించారు. హరియాణా ఫరీదాబాద్‌లో జరిగిన 32వ నార్తర్న్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఆయన, ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో సహా పెకిలించి వేస్తామని తెలిపారు. ఇది కేంద్ర ప్రభుత్వ విధానమన్న ఆయన, మోదీ ప్రభుత్వానికి మంచి ట్రాక్ రికార్డ్ ఉందన్నారు. పాతాళ లోకంలో దాక్కున్న తీసుకువస్తామన్న ఆయన, నిందితులను చట్టం ముందు నిలబెడుతామని చెప్పారు. కాగా సమావేశం ప్రారంభమయ్యే ముందు ఢిల్లీ ఎర్రకోటతో పాటు జమ్ము కశ్మీర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్ పేలుడు ఘటనలో మరణించిన వారికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.
రాష్ట్రాలను బలోపేతం చేయడంతోనే దేశం అభివృద్ధి చెందుతుందనేది మోదీ ప్రభుత్వ విధానమని అమిత్ షా చెప్పారు. అభివృద్ధిలో ప్రాంతీయ మండళ్లు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. జోనల్ కౌన్సిళ్లు చర్చలు, సహకారం, సమన్వయం, విధాన నిర్ణయాల్లో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అనేక సమస్యలను ఈ మండళ్లు పరిష్కరించాయని పేర్కొన్నారు. ప్రస్తుతం అనేక సమస్యలు పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నాయని, ముఖ్యంగా మహిళ, చిన్నారుల పట్ల జరిగిన నేరాల్లో వేగంగా న్యాయం జరగాలని తెలిపారు. పోక్సో చట్టం కింద నమోదయ్యే లైంగిక వేధింపులపై త్వరితగతిన విచారణ చేపట్టి న్యాయం అందించాలని సూచించారు. ప్రపంచంలోనే ఏ నాగరిక సమాజం కూడా మహిళలు, చిన్నారుల పట్ల చేసే నేరాలను సహించదని చెప్పారు. మహిళలు, చిన్నారుల భద్రత ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని, ఇందుకోసం ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

**15కు పెరిగిన మృతుల సంఖ్య**

నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన కారు పేలుడు వల్ల ఇప్పటివరకు 15 మంది చనిపోయారు. ఇంకా 30కి పైగా గాయపడ్డారు. దీనిపై జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తు చేపడుతోంది. అలాగే ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్, క్రైమ్ బ్రాంచ్ లాంటి సంస్థలు కూడా విస్తృత స్థాయిలో దర్యాప్తు చేస్తున్నాయి. ఈ దర్యాప్తులో భాగంగా టెర్రర్ మాడ్యూల్‌కు సంబంధం ఉన్న అల్‌ఫలాహ్ యూనివర్సిటీ ఛైర్మన్ జావేద్ అహ్మద్ సిద్దిఖీకి ఢిల్లీ పోలీసులు రెండు సమన్లు జారీచేశారు.
పేలుడు ఘటనకు సంబంధించి ఒకటి ఫోర్జరీ, చీటింగ్‌కు సంబంధించి యూనివర్సిటీపై రెండు కేసులు నమోదుకావడంతో మరొక సమన్ జారీచేసినట్లు తెలుస్తోంది. యూనివర్సిటీ నిర్వహణ, వర్సిటీతో సంబంధం ఉన్న వ్యక్తులకు సంబంధించిన లింకులపై ఛైర్మన్ సిద్దిఖీ వాంగ్మూలం కీలకంకానుందని భావిస్తున్నారు. యూజీసీ, నాక్ సంస్థలు అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయానికి సంబంధించి నిబంధనల ఉల్లంఘ నలను దర్యాప్తు సంస్థల దృష్టికి తెచ్చినట్లు సమాచారం. వర్సిటీ గుర్తింపునకు సంబంధించి తప్పుడు పత్రాలపై దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు. యూనివర్సిటీ రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, ఇతర అనుమతులను కూడా పరిశీలించనున్నట్లు సమాచారం.

# సీఎం పదవికి నీతీశ్ రాజీనామా

ధర్మేంద్ర ప్రధాన్‌తో సమావేశమయ్యారు. "మంత్రివర్గంలో స్థానం కోసం మేము చర్చించలేదు. ఒకటి మాత్రం స్పష్టంగా చెప్పగలను బిహార్ ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమార్ ఎంపికవుతారు. మేము ఎప్పుడూ కేబినెట్ ర్యాంక్, శాఖల కోసం ఒత్తిడి చేయలేదు. మాకు అప్పగించిన బాధ్యతలు నిర్వహిస్తూ ప్రశాంతంగా ఉన్నాం. ఈరోజు మా పార్టీ శాసనసభా పక్ష సమావేశం జరిగింది. అందులో ఎలాంటి మంత్రిత్వ శాఖలు కోరకూడదని నిర్ణయం తీసుకున్నాం. వారు ఏం ఇచ్చినా తీసుకుంటాం. 46ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఏ స్థానం కోసం డిమాండ్ చేయలేదు."

# నిర్ణయం మీరు తీసుకుంటారా...!! మమ్మల్ని తీసుకోమంటారా...!!!

చేసి నిర్ణయం ప్రకటించాలని సూచించినా.. ఆలస్యం చేయటం పైన సుప్రీం కోర్టు సీరియస్ అయింది. దీంతో.. బీఆర్ఎస్ తాజాగా దాఖలు చేసిన పిటీషన్ పైన విచారణ సమయం లో సుప్రీం స్పీకర్ కు కోర్టు ధిక్కరణ నోటీసు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా ఎమ్మెల్యేల పై అనర్హత పిటీషన్ల విచారణ పూర్తి చేయాలని నిర్దేశించింది. ఇదే సమయంలో మీరు నిర్ణయం తీసుకుంటారా.. మేము తీసుకోవాలా అంటూ సుప్రీం కోర్టు ప్రశ్నించింది. దీంతో.. ప్రభుత్వం తరపు న్యాయవాది నాలుగు వారాల్లో విచారణ పూర్తి చేస్తామని కోర్టుకు స్పష్టం చేసారు. ఈ కేసును నాలుగు వారాలకు వాయిదా వేస్తూ సుప్రీం నిర్ణయం తీసుకుంది.

# ఉగ్రవాదులు, వారి మద్దతుదారులను భారత్ ఒకేలా చూస్తుంది : భారత ఆర్మీచీఫ్

ఉగ్రవాదులపై భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది కీలక కామెంట్స్ చేశారు. ఉగ్రవాదులు, వారి మద్దతుదారులను భారత్ ఒకే విధంగా చూస్తుందని ద్వివేది అన్నారు. భారత్‌ను లక్ష్యంగా చేసుకొన్న ఉగ్రవాద గ్రూపులకు మద్దతు ఇస్తే అది పొరుగు దేశానికే నష్టమని హెచ్చరించారు. భారత్ తమ ప్రజల శ్రేయస్సుపైనే ప్రధానంగా దృష్టి పెడుతుందని, ఆ మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టించాలని చూస్తే అందుకు తగిన విధంగా ప్రతిస్పందిస్తామన్నారు. తాము కోరుకుంటున్నదల్లా శాంతియుత ప్రక్రియను అవలంభించాలని, అందుకు తాము కూడా సహకరిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా పాకిస్థాన్‌తో వ్యవహరించడంలో భారత్ సరికొత్త వ్యూహాన్ని అనుసరిస్తోందని ఆయన తెలిపారు. ఢిల్లీలో జరిగిన 'చాణక్య డిఫెన్స్ డైలాగ్స్' కార్యక్రమంలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ అనేది కేవలం ట్రైలర్ మాత్రమేనని ఆర్మీచీఫ్ అన్నారు. భారత్ ఎలాంటి బెదిరింపులకు లొంగదని, భారత పురోగతికి అడ్డంకులు సృష్టించాలని చూస్తే అందుకు తగ్గ చర్యలు తీసుకోవడానికి భారత దళాలు సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించారు. "ఆపరేషన్ సిందూర్ అనేది ట్రైలర్ మాత్రమే. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులకైనా మేము సిద్ధంగా ఉన్నాం. పాకిస్థాన్ అవకాశం ఇస్తే, పొరుగు దేశంతో బాధ్యతాయుతంగా ఎలా ప్రవర్తించాలో నేర్పిస్తాం. నేటి కాలంలో యుద్ధం వస్తే అది ఎంతకాలం కొనసాగుతుందో మనం చెప్పలేం. అందుకు తగ్గ సామాగ్రి మన వద్ద ఉండేలా చూసుకోవాలి. అవసరమైతే నాలుగు సంవత్సరాలు పాటు జరిగే దీర్ఘకాలిక యుద్ధాలకు సైతం ఆహారం, మందుగుండు సామాగ్రిని సిద్ధం చేసుకోవాలి

# బంగ్లా మాజీ ప్రధాని హసీనాకు మరణ శిక్ష

అభియోగాల వాదనలు విన్న ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ సోమవారం ఆమెను దోషిగా తేల్చింది. "నేను బతికే ఉన్నాను. ఉంటాను. ప్రజల సంక్షేమం కోసం నా పనిని ప్రారంభిస్తాను. వాళ్లు ఏ తీర్పు అయినా ఇవ్వనివ్వండి. నాకు సంబంధం లేదు. దేవుడు ఇచ్చిన ప్రాణం ఆయనే తీసుకుంటాడు. అప్పటివరకు నా ప్రజల కోసం పనిచేస్తాను. ఈ దేశం కోసం నా తల్లిదండ్రులు, తోబుట్టువులను పోగొట్టుకున్నాను. వారు నా ఇంటిని కాల్చివేశారు. గోనో భవన్ (బంగ్లా ప్రధానమంత్రి అధికారిక నివాసం) నా ఆస్తి కాదు. అది ప్రభుత్వానిది. నేను దేశం వీడిన తర్వాత దానిలో లూటీ జరిగింది. అది విప్లవం అని వారు చెప్తున్నారు. గూండాలు, ఉగ్రవాదులు విప్లవాన్ని తీసుకురాలేరు." అని హసీనా మండిపడ్డారు.

# పంచాయతీల పేరిట పల్లెల్లో పెరిగిన డబ్బు దోపిడీ

**పెద్దమనుషుల చేతుల్లో ప్రజా సమస్యలు బేరాలు**

**తీర్పు కోసం డిపాజిట్లువాయిదాల కోసం రోజువారీ కలెక్షన్లు**

**భూముల కేసుల్లో పర్సంటేజ్ చెల్లించాలేకపోతే న్యాయం దూరమే**

**అనధికార పంచాయతీలు నడుస్తున్నా అధికారులు నిశ్శబ్దం**




అక్షరం ఇనుగుర్తి నవంబర్ 17నెల్లికుదురు ఇనుగుర్తి మండలంలోని గ్రామాలు తండాలు శివార్లన్నీ పంచాయతీల పేరుతో నడుస్తున్న డబ్బు దందాతో వేడి రాజకీయం కన్నా బాగా మారుమోగుతున్నాయి సమస్యల్ని పరిష్కరించడం కోసం ప్రజలు పెద్దమనుషుల వద్దకు వెళ్లినా అక్కడ న్యాయం కాక డిపాజిట్ల పేరుతో దోపిడీ అభివృద్ధి చెందుతూ పెద్దమనుషుల ఆదాయం కోసం పంచాయతీలు వేదికలుగా మారిపోయాయి పంచాయతీ పెట్టుకోవాలంటే ఇరవై వేల నుంచి లక్ష వరకు డిపాజిట్ తప్పదని పెద్దమనుషులు బహిరంగంగానే చెప్పుకుంటూ వస్తుండగా ఒకే రోజు తీర్పు చెప్పగలిగేది వారి స్వప్రయోజనాల కోసం మూడు నాలుగు సార్లు వాయిదా వేస్తూ ప్రతి వాయిదాతో డిపాజిట్ డబ్బుల్లోంచి రోజువారీ వాటాలు తీసుకుంటూ మిగిలిన మొత్తాన్ని మద్యం దుకాణాలు హెూటళ్లలో ఖర్చు చేస్తూ పంచాయతీ పేరుతో ప్రజల డబ్బు గింజుకుంటున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి ఇక గ్రామాల్లోని రాజకీయ నాయకులు పలు సంఘాల పెద్దలు ఈ అనధికార పంచాయతీలకు కనుసన్నలు కాయడంతో ప్రజలు రెట్టింపు ఇబ్బందులు పడుతుండగా గతంలో చేసిన పంచాయతీలకు తీసుకున్న డిపాజిట్లు కూడా తిరిగి ఇవ్వక సొంత అవసరాలకు ఖర్చు పెట్టిన పెద్దమనుషుల జాబితా కూడా పెరుగుతూనే ఉందని ఫిర్యాదుదారులు చెబుతున్నారు
భూముల వివాదాలు అయితే మరింత భయంకరంగా మారి గెట్టు పంచాయతీ పేరుతో భూముల రేట్లు పెరిగిన కారణంగా పెద్దమనుషులు పర్సంటేజ్ పద్ధతిని తెరపైకి తీసుకొొచ్చి శాతం ఇచ్చినవారికే మీ వైపు మాట్లాడతామని చెప్పి మిగతావారిని ఆటపట్టిస్తూ న్యాయాన్ని వ్యాపారంగా మార్చేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు విడాకుల పంచాయతీల్లో అమ్మాయి కుటుంబాల నుండి తీసుకునే రుణం తగ్గించడం పేరుతో అబ్బాయి వైపు కమిషన్ తీసుకోవడం పెట్టుపోతల్ని తగ్గించి లాభం పొందడం వంటి చర్యలు అమ్మాయి తల్లిదండ్రులకు మరింత భారమవుతుండగా ఈ వ్యవహారాల్లో న్యాయం అందాలంటే డబ్బు తప్ప మరేమీ పని చేయకపోవడం ప్రజల మనసుల్ని మరింత కలచేస్తోంది ఇదంతా పెద్దమనుషుల ముందు బహిరంగంగానే జరుగుతున్నా అధికారులు స్పందించకుండా నిశ్శబ్దంగా ఉండటం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తూ పంచాయతీ పేరిట నడుస్తున్న ఈ స్వైర దందా ఎవరైనా అరికడతారా అనే ప్రశ్న ప్రతి ఇంట్లో వినిపిస్తోంది ప్రజలు ఇప్పటికైనా అధికారులు కఠిన చర్యలు తీసుకుని డబ్బు దందాని పంచాయతీ పేరిట నడుస్తున్న లొసుగులను నిలువరించాలని గట్టిగా కోరుతున్నారు

## ఎంబీబీఎస్ సాధించిన గిరిజన విద్యార్థికి ఆర్థిక సహాయం



**తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 17** లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు అధ్యక్షులు లయన్ డాక్టర్ సూర్నం రామ నర్సయ్య ఆధ్వర్యంలో సోమవారం మెడికల్ సీటు సాధించిన గిరిజన విద్యార్థిని శివానందకి డాక్టర్ రామ నరసయ్య సహకారంతో రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రామ నర్సయ్య మాట్లాడుతూ అదిలాబాద్ జిల్లాలోని దస్నాపూర్ లోని నిరుపేద కుటుంబానికి చెందిన గిరిజన పూజ-రామేశ్వర్ కుమార్తె కష్టపడి చదివి ఎంబిబిఎస్ సీటు సాధించి వికారాబాద్ లోని మహావీర్ మెడికల్ కాలేజీలో చదువుతుందని,నిరుపేద కుటుంబంలో జన్మించి పై చదువుల కోసం వెళ్తున్న క్రమంలో ఆమె కష్టాలను గుర్తించి గిరిజన నిరుపేద విద్యార్థికి చదువుకోవడానికి సహాయం అందించాలనే ఉద్దేశంతో వికారాబాద్ 230 కిలోమీటర్ల దూరం వెళ్లి అమ్మాయికి రూ.30 వేలు రూపాయల ఆర్థిక సాయం అందించి స్టెతస్కోప్,ఆప్రాన్, బ్యాగ్స్ ను అందించి అమ్మాయిని సన్మానించి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ ముదుపు రవీందర్ రెడ్డి,క్లబ్ ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్,ఫాస్ట్ ప్రెసిడెంట్ మాదారపు వేణుగోపాల్, క్లబ్ జాయింట్ సెక్రెటరీ బోనగిరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి





**తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 17** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సేవా తరుణి క్లబ్ అధ్యక్షురాలు తుమ్మూరు శ్రీదేవి రెడ్డి పిలుపునిచ్చారు.లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవాతరుణి ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షురాలు లయన్ తుమ్మూరు శ్రీదేవి వెంకట్ రెడ్డి సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ఉదయం ఆకలితో స్టడీ అవర్స్ కు పాల్గొంటున్నారని రూ.36 వేలతో మండలంలోని నాంచారి మడూరు జెడ్పిహెచ్ఎస్, పెద్ద వంగర మండలంలోని వడ్డే కొత్తపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు 30 రోజులపాటు ఆల్ఫా ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ జివెల్టి కోఆర్డినేటర్ లయన్ డాక్టర్ వేలూరి శారద, డిస్టిక్ క్యాబినెట్ మెంబర్ లయన్ డాక్టర్ ఎస్ నాగవాణి, నాంచారి మడూరు పాఠశాల హెచ్ఎం లయన్ వీరన్న,వడ్డే కొత్తపల్లి పాఠశాల హెచ్ఎం లయన్ శేష వల్లి,లయన్ ఉమా రెడ్డి, లయన్ అనుపమా రెడ్డి,పాఠశాల ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ఇనుగుర్తి అభివృద్ధికి కొత్త దిశ

### నూతన తహసిల్దార్‌గా సుంకరి శ్రీనివాస్ బాధ్యత స్వీకారం



తొలి అక్షరం ఇనుగుర్తి నవంబర్ 17ఇనుగుర్తి మండల పరిపాలనలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఇన్‌ఛార్జ్ తహసిల్దార్‌గా పనిచేసిన తరంగిణి బదిలీ నేపథ్యంలో, పాల్వంచ డీటీగా ప్రతిభ కనబరిచిన సుంకరి శ్రీనివాస్ ప్రమోషన్‌పై సోమవారం ఇనుగుర్తి మండల నూతన తహసిల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల కార్యాలయంలో జరిగిన కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ "నూతనంగా ఏర్పాటు చేసిన ఇనుగుర్తి మండల అభివృద్ధి మా ప్రాధమిక లక్ష్యం. ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలన అందించడానికి కట్టుబడి ఉన్నాను. గ్రామాల్లో ఎదురయ్యే ఏ సమస్య అయినా నేరుగా నాకు తెలియజేయండి. ప్రతి అర్జీకి ప్రాధాన్యమిస్తూ పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటాను," అని స్పష్టం చేశారు.మండల ప్రజలు కొత్త తహసిల్దార్ నియామకాన్ని స్వాగతిస్తూ, ఇనుగుర్తి అభివృద్ధికి మరింత అభివృద్ధి దక్కుతుందనే నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.

# శ్రీ ధన్వంతరి భగవానుడి జయంతి శుభాకాంక్షలు

## - ఆయుర్వేదంలో ఆధ్యాత్మిక పరిమళాలు -భారతీయ వైద్య శాస్త్ర వైభవం






**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్17:** భారతదేశపు స్వదేశీ పురాతన వైద్య శాస్త్రమైన ఆయుర్వేదం సుమారు 5000 సంవత్సరాల నాటి చరిత్రను కలిగి ఉంది. దీనిని అథర్వణ వేదం ఉపవేదంగా పరిగణిస్తారు.ప్రపంచంలోని అతి పురాతన లిఖిత సాహిత్యమైన ఋగ్వేదంలో సైతం ఔషధ ప్రయోగాల కోసం మూలికల వాడకం గురించి ప్రస్తావించబడటం ఆయుర్వేద ప్రాచీనతకు నిదర్శనం. భారతీయ సంస్కృతిలో లోతుగా పాతుకుపోయిన దీనిని భారతదేశ స్వదేశీ వైద్యశాస్త్రం అని పిలుస్తారు.

**వేదాలలో ఆయుర్వేద ప్రస్తావన:**

వేదవ్యాసుడు (వ్యాస మహర్షి) కలగాపులగంగా ఉన్న వేదాలను నాలుగుగా వర్గీకరించి, వాటికి ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదం, అధర్వణ వేదము అనే పేర్లు పెట్టాడు.వేదాలు మానవ జీవనానికి సంబంధించిన విజ్ఞాన శాస్త్రం, సాంఘిక శాస్త్రం, వైద్యశాస్త్రం, సాంకేతిక శాస్త్రంగా భాసిల్లుతున్నాయి.

ఆయుర్వేదం అంశాలు ఈ నాలుగు వేదాలలోనూ ప్రస్తావించబడ్డాయి.

ఋగ్వేదము (దేవతలు): దేవతారాధనలు, మంత్రాలు, హోమాలు.

యజుర్వేదము (మెడిసిన్): రోగాలు, చికిత్సలు, శస్త్ర చికిత్సలు, గాయాలకు చికిత్సా విధానాలు.

సామవేదం (కళలు): గాన సంబంధమైన రహస్యాలు, కళలకు సంబంధించిన విజ్ఞానం.

అధర్వణ వేదము (ఇంజనీరింగ్): రథాలు, బండ్లు, నగర నిర్మాణాలు, ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన విజ్ఞానం.

శ్రీ ధన్వంతరి భగవానుడు: ఆయురారోగ్య ప్రదాత

శ్రీ ధన్వంతరి భగవానుడు సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువు అవతారం. ఆయన సర్వజనులకు ఆయురారోగ్య ప్రదాత. పురాణాల ప్రకారం, దేవతలకు రాక్షసులకు జరిగిన క్షీరసాగర మథనం సందర్భంగా, మందర పర్వతం కవ్వంగా, వాసుకి సర్పరాజు తాడుగా మారగా, చివరకు శ్రీ మహావిష్ణువు అవతారమైన శ్రీ ధన్వంతరి భగవానుడు అమృతంతో నిండిన అమృత కలశాన్ని చేబూని ప్రత్యక్షమయ్యారు. ఈ అమృతం సేవనం వలన దేవతలు జరా-మరణములు లేకుండా అమరులయ్యారు.అదేవిధంగా మానవులకు కూడా వ్యాధుల నుండి ఉపశమనం కలిగేందుకు, దేవతలు తమ శిష్యులైన మహర్షులకు ఆయుర్వేద యోగాలను ఉపదేశించారు.

ఆయుర్వేద సంహితలు: జ్ఞాన ప్రవంతి

సృష్టికర్త అయిన బ్రహ్మదేవుని సూచనల మేరకు, ధన్వంతరి భగవానుడు, దివోదాసుడు, కాశీరాజు, అశ్విని కుమారులు, నకులుడు, సహదేవుడు, ఆర్తి (యముడు) సహా అనేకమంది మహర్షులు ఆయుర్వేదంపై గ్రంథాలను రచించారు. వీరిలో ముఖ్యమైనవి:

**ధన్వంతరి: ధన్వంతరి చికిత్స తత్వవిజ్ఞానం**

దివోదాసుడు:చికిత్స దర్పణం

అశ్విని కుమారులు: చికిత్స సార తంత్రం

భరద్వాజ మహర్షి నుండి ఆయుర్వేదాన్ని నేర్చుకున్న ఆత్రేయ మహర్షి తన ఆరుగురు శిష్యులకు బోధించారు. వీరిలో తెలివైన విద్యార్థి అయిన అగ్నివేశుడు రచించిన అగ్నివేశ సంహిత కాలక్రమంలో చరక సంహిత (క్రీ.పూ. 1500) గా ప్రచురించబడింది. ఇది ఆయుర్వేదంలోని ప్రతి ప్రాథమిక సూత్రాన్ని విశదంగా వివరించిన అద్భుత గ్రంథం. చరక మహర్షిని ఆయుర్వేద పితామహుడు గా గౌరవిస్తారు.

**శస్త్రచికిత్స పితామహుడు సుశ్రుతుడు:**

ధన్వంతరి భగవానుని మరో తెలివైన విద్యార్థి సుశ్రుత మహర్షి. శస్త్రచికిత్స కళను అభ్యసించి సుశ్రుత సంహిత (క్రీ.పూ. 1200) అనే గ్రంథాన్ని రచించారు.ఈ గ్రంథంలో 1,120 వ్యాధులు, 700 ఔషధ మొక్కలు 125 శస్త్రచికిత్సా పరికరాలు వివరించబడ్డాయి. మానవజాతి చరిత్రలో మొట్టమొదటి రైనోప్లాస్టీ (ముక్కు శస్త్రచికిత్స) తో సహా అనేక సౌందర్య శస్త్రచికిత్సలు చేసిన మొదటి వ్యక్తి ఈయనే.ఈ కారణంగా సుశ్రుత మహర్షిని ఇప్పటికీ ప్లాస్టిక్ సర్జరీ పితామహుడు గా పరిగణిస్తారు.

గోవాలోని రాజ్ భవన్‌లోని వామన్ వృక్షకళా ఉద్యానవనంలో సుశ్రుతుడు,చరకుడి విగ్రహాలు ఉన్నాయి.వీటిని మే 2025లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్ ఆవిష్కరించారు.

ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లోని రాయల్ ఆస్ట్రేలియన్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ లో కూడా ఆచార్య సుశ్రుత మహర్షి పాలరాయి విగ్రహాన్ని ప్రదర్శించారు.శివగుటిక, హోమం దేవతానుగ్రహం ఆయుర్వేదానికి ఆధ్యాత్మిక బంధం ఎంతగానో ముడిపడి ఉంది. శివగుటిక వంటి ఔషధాల ప్రస్తావన ఇందుకు నిదర్శనం. ఊబకాయం, మధుమేహం వంటి అనారోగ్యాలతో బాధపడుతున్న తన కుమారుడు వినాయకునికి ఉపశమనం కలిగించేందుకు మహా శివుడు అడవి నుండి వనమూలికలను సేకరించి శివగుటిక అనే అత్యంత శక్తివంతమైన ఔషధాన్ని తయారుచేసి చికిత్స చేసినట్లు పురాణ కథనం. ఈ యోగం భైషజ్య రత్నావళి గ్రంథంలో ప్రస్తావించబడింది.

కొన్ని వ్యాధులు పూర్వ జన్మ కృతం పాపం,వ్యాధి రూపేణ బాదితం (పూర్వజన్మ పాపం వలన వ్యాధులు కలుగుతున్నవి) అనే సిద్ధాంతంపై ఆధారపడి ఉన్నాయని,అటువంటి సందర్భాలలో ఔషధాలు పనిచేయనిచో, అగ్నియందు పడవేసిన సుగంధ ద్రవ్యాల శక్తులతో కూడిన వేడిగాలిని పీల్చే హోమము ద్వారా రోగి శరీరమందలి దోషములు కరిగి ఉపశమనం కలుగుతుందని ఆయుర్వేద గ్రంథాలు వివరిస్తున్నాయి.

దక్ష యజ్ఞాన్ని మహా శివుడు చెల్లాచెదురు చేసిన సమయంలో అగ్నిగుండం నుండి వెలసిన యజ్ఞపురుషుడు శివాజ్ఞానుసారం ధర్మ మార్గం పాటించని ప్రజలను జ్వర రూపంలో పట్టి పీడిస్తున్నట్లు ఆయుర్వేద గ్రంథాలు తెలుపుతున్నాయి.

**దేవతల పేర్లతో ఔషధాలు:**

ఆయుర్వేదంలో లక్ష్మీ విలాస రసము, ధన్వంతరి గుటిక, సరస్వతీ లేహ్యం, మహా నారాయణ తైలం, రామబాణ రసం, గంధక రసాయనం (ఈశ్వరునిచే అనుగ్రహించబడినది) వంటి అనేక ఔషధాలు ఆయా దేవతల పేర్లతో ఆవిష్కరింపబడటం, ఈ వైద్యం ఆధ్యాత్మిక బంధంతో పెనవేసుకుపోయిందనడానికి మరో రుజువు.

ఆయుర్వేదము అనే పదంలోనే వేదము అనే పదబంధం ఇమిడి ఉండటం వలన, ఇది వేద సమానమైన ప్రాశస్త్యం కలిగి ఉందనడంలో సందేహం లేదు. అనేక వేల ఏళ్లుగా రాజవైద్యం గా భాసిల్లుతున్న ఆయుర్వేదం, మానవుల ఆయుస్సును ఆరోగ్యమునూ కాపాడడంలో తన ప్రాభవాన్ని నిలబెట్టుకుంటూ వస్తోంది.



-రామడుగు వీరభద్రాచార్య,
పారంపర్య ఆయుర్వేద వైద్యులు, రామభద్ర ఆయుర్వేద పీఠం
సర్వేజనాఃసుఖినోభవంతు- లోకాసమస్తాసుఖినోభవంతు

# సర్వత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవంతమైన ఉచిత వైద్య శిబిరం

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్17:** సర్వత్ర ఫౌండేషన్ వారు ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం హనుమకొండ టీచర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్లో భారీ స్థాయిలో ఫ్రీ మెడికల్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించారు. నవంబర్ 2వ తేదీన జరిగిన క్యాంప్‌కు వచ్చిన విశేష స్పందనను దృష్టిలో పెట్టుకుని, స్థానిక ప్రజల అవసరాలను తీర్చేందుకు ఈ శిబిరాన్ని తిరిగి ఏర్పాటు చేశారు.వరంగల్, హనుమకొండ, ఖాజీపేట పరిసర ప్రాంతాల ప్రజలు శిబిరానికి పెద్ద ఎత్తున హాజరయ్యారు. తొలిక్యాంప్ రోజు హోమియో మందులు తీసుకున్న పలువురు రోగులు, ఆరోగ్యం మెరుగుపడిన అనుభవాలను పంచుకోవడమే కాక వైద్య సేవలను ప్రశంసిస్తూ తమ సంతృప్తిని వ్యక్తం చేశారు.చికిత్స వల్ల ఉపశమనం పొందిన వృద్ధులు, మహిళలు, యువకులు తోపాటు, కొంతకాలంగా ప్రయాసలను ఎదుర్కొంటున్న రోగులు కూడా తిరిగి వచ్చి వైద్యులను వ్యక్తిగతంగా అభినందించారు.

అనేక సంవత్సరాల అనుభవం కలిగిన హోమియో వైద్య నిపుణులు డాక్టర్ శిష్టా చంద్రశేఖర్ ఈ క్యాంప్‌లో ప్రధానంగా సేవలందించారు.వారు కింద పేర్కొన్న సమస్యలతో బాధపడుతున్న రోగులకు ప్రత్యేకంగా కేసులు పరిశీలించి సమగ్రంగా చికిత్స అందించారు.

కీళ్ల నొప్పులు,తొడ నొప్పి,నడుం నొప్పి,భుజం నొప్పి, మెడ



నొప్పి దైనందిన జీవితంలో ఇబ్బందులు కలిగించే ఇతర రకరకాల దీర్ఘకాల రుగ్మతలు,ప్రతి రోగిని సమగ్రంగా పరిశీలించి, వారికి తగిన విధంగా హోమియో మందులు ఉచితంగా అందించడం ఈ క్యాంప్ ప్రత్యేకతగా నిలిచింది.సర్వత్ర ఫౌండేషన్ భారత దేశానికి ప్రేరణాత్మక నేతగా నిలిచిన డాక్టర్ ఏ.పీ.జే. అబ్దుల్ కలాం సేవా భావం మనోభావాలకు అనుగుణంగా బ్రిం ప్రేరణగా స్థాపించబడింది. సామాన్య ప్రజలకు నాణ్యమైన, అందుబాటు వైద్యసేవలను అందించాలన్న సంకల్పంతో ఈ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు చేపడుతోంది. వైద్యం ఉచితం, మందులు ఉచితం, మరియు ప్రతి రోగికి సమాన శ్రద్ధతో సేవ చేయడం అందరూ అభినందించిన అంశాలుగా నిలిచాయి.తదుపరి క్యాంప్ తేదీలు ప్రకటించిన నిర్వాహకులు,ఈ క్యాంప్ అందుకున్న స్పందనను పరిగణనలోకి తీసుకుని,



నవంబర్ 30,డిసెంబర్14,డిసెంబర్29 తేదీల్లో కూడా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు కొనసాగనున్నట్లు సర్వత్ర ఫౌండేషన్ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు.స్థానిక ప్రజల కోసం ఇది ఎంతో ఉపయోగకరమని, మరింత మంది ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమం ప్రగతిమిత్ర కాలనీ డెవలప్‌మెంట్ %డ% సొసైటీ అధ్యక్షులు ఎల్లయ్య, మీరా సంగీత మండలి అధ్యక్షులు పింగళి వెంకటేశ్వర రావు సంయుక్తంగా దీపప్రజ్వలనతో ప్రారంభించారు.

ప్రారంభోత్సవానికి హాజరైన ప్రముఖులు:

శ్రీ దుర్గానాథ్ చక్రవర్తి,ఆవంచ పూర్ణచందర్,కోడం గౌతమ్,వెలుగటి రాజి రెడ్డి,చివుకుల సుబ్రహ్మణ్యం, సిరిపురం రమేష్,ఉప్పుటూరు సతీష్ కుమార్,డాక్టర్ బింగి అటారీ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆర్.ఎం.పి పి.ఎం.పి లపై దాడులు చేయడం సరికాదు.

**తక్షణమే ఆర్ఎంపి పిఎంపీలకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందజేయాలి.**

**ఆర్ఎంపి పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ తొర్రూరు మండల అధ్యక్షులు ధర్మారపు హన్మంతు.**



**తొలి అక్షరం రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 17** ఆర్.ఎం.పి, పిఎంపి ల ఫస్ట్ ఎయిడ్ సెంటర్ లపై దాడులు చేయించడం సరికాదని తక్షణమే ఆర్ఎంపి పిఎంపీలకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందజేయాలని ఆర్ఎంపి పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ తొర్రూరు మండల అధ్యక్షులు ధర్మారపు హన్మంతు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం తొర్రూరు మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో నిర్వహించిన ఆర్.ఎం.పి పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్యులే గ్రామాలకు పట్టుకొమ్మలని.. గ్రామీణ వైద్యులు లేని గ్రామాలు ఆరోగ్యవంతమైన గ్రామాలు ఉండవని... ప్రథమ చికిత్సలకు కూడా కార్పొరేటు ఆసుపత్రులకు వెళ్లలేక ఫీజులు కట్టే పరిస్థితుల్లో ఉండని పేద ప్రజలు ఆర్ఎంపి పిఎంపీల సేవలతో ప్రజలు ఆరోగ్యంగా జీవిస్తున్నారని అలాంటి ఆర్ఎంపి పిఎంపీలను ప్రభుత్వం విస్మరించడం సరికాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆర్ఎంపీ, పీఎంపిలపై టిజిఎంసి, ఐఎంఏ దాడులను అరికట్టాలని, గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యాన్ని అందిస్తున్న గ్రామీణ వైద్యుల ప్రథమ చికిత్స కేంద్రాలపై దాడులు ఆపివేసే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనియెడల గ్రామీణ వైద్యులందరూ ఏకతాటిపైకి వచ్చి నిరసన కార్యక్రమాలు ఆందోళన పోరాటాలు నిర్వహించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ పి.ఎం.పి వెల్ఫేర్ అసోసియేషన్ పాలకుర్తి నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ సింగారపు భీమయ్య, నియోజకవర్గ ఉపాధ్యక్షులు గడ్డం రాజమౌళి, తొర్రూరు మండల కోశాధికారి గద్దల వెంకటేష్, తొర్రూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మనబోయిన యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఓటుకు విలువ లేదా?' - మందులకే సరిపోని పెన్షన్,2000, నాలుగు వేలు ఎప్పుడు

**- ఎన్నికల వాగ్దానం**

**అమలు కోసం వృద్ధుల ఆత్రుత**

**- రెండు వేల పెన్షన్‌తో రోజువారీ జీవనం**

**కష్టసాధ్యం**

**-వైద్య ఖర్చులతో తంటాలు పడుతున్న వృద్ధులు-**

**వికలాంగులు**

**- 57 ఏళ్లు నిండిన వారందరికీ కొత్త పెన్షన్లు**

**మంజూరు చేయాలని డిమాండ్**





**తొలి అక్షరం ఇనుగుర్తి నవంబర్ 17**ఇనుగుర్తి మండలంలోని గ్రామాలన్నింటిలోనూ వృద్ధులు, వితంతువులు, గీత కార్మికులు, ఒంటరి మహిళలు, వికలాంగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎన్నికల ప్రచారంలో హామీ చేసిన నాలుగు వేల రూపాయల పెన్షన్ కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన పార్టీ, ఈ వాగ్దానాన్ని అమలు చేస్తుందనే నమ్మకంతో ఓటు వేసిన నిరుపేదలు ఇప్పుడు నిరాశలో మునిగిపోయారు.ప్రస్తుతం అందుతున్న రెండు వేల రూపాయల పెన్షన్‌తో జీవనం సాగించడం కష్టమైపోయిందని వారు వాపోతున్నారు. దినదినాభివృద్ధితో పెరుగుతున్న కూరగాయల ధరలు, నిత్యావసర వస్తువుల ఖర్చులు, పెరిగిన నూనె%-%సబ్బుల ధరలతో జీవనం మరింత భారమైందని చెప్తున్నారు. చాలా మంది షుగర్, బీపీ, టీబీ వంటి వ్యాధులతో బాధపడుతుండగా మందులు కొనడానికి కూడా పెన్షన్ సరిపోవడం లేదని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చిన్న నాగారం గ్రామానికి చెందిన బైరు సోమక్క, మద్దెబోయిన లక్ష్మి, కోలా జయమ్మ, కముటం ప్రమీల వంటి అనాథ%-%ఒంటరి మహిళలు మాట్లాడుతూ, “మాసానికి వచ్చే రెండువేలే మా బతుకుసాధనం%ొ%  అది సరిపోక నెల రోజులు నెట్టుకురావడం కష్టమైపోయింది. వెంటనే నాలుగు వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలి” అని విజ్ఞప్తి చేశారు. అంతేకాదు 57 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వృద్ధుల ఆవేదన, జీవన సంగ్రామం ప్రభుత్వాన్ని స్పందింపచేస్తుందా? ఇప్పుడు అందరి చూపూ అధికారాలపై నిలిచింది.

# రైతుల ముఖాల్లో నూరుశాతం నమ్మకం - లైనతండాలో వరి కొనుగోలు కేంద్రం

**- రాజమాత కొనుగోలు కేంద్రం ప్రారంభంతో**

**లైనతండా రైతులకు పెద్ద ఊరట**

**-నాణ్యమైన, ఎండబెట్టిన వరినే స్వీకారంరైతులకు**

**తహసీల్దార్ శ్రీనివాస్ సూచనలు**

**-కొనుగోలు తరువాత 7-10 రోజుల్లోపే**

**చెల్లింపులు ఖాతాల్లో: అధికారుల హామీ**



**తొలి అక్షరం ఇనుగుర్తి నవంబర్ 17**ఇనుగుర్తి మండలం చిన్న నాగారం మీట్యా తండా పరిధిలోని లైనతండాలో రైతులు ఎంతోకాలంగా ఎదురు చూసిన రాజమాత వరి ధాన్యం కొనుగోలు కేంద్రం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. కొత్త తహసీల్దార్ సుంకరి శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టిన వెంటనే రైతుల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని, ఎంపీడీఓ పార్థసారధితో కలిసి కొనుగోలు కేంద్రం ప్రారంభించడంతో, స్థానిక రైతుల్లో సంతోషం వెల్లివిరిసింది.తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ, వరి ధాన్యాన్ని బాగా ఎండబెట్టి, తాళుతెమ్మలు, మట్టిపెళ్లలు లేకుండా తీసుకురావాలని రైతులకు ప్రత్యేకంగా సూచించారు. నాణ్యమైన వరినే కేంద్రం వద్ద స్వీకరించి టోకెన్లు జారీ చేయబడతాయని స్పష్టం చేశారు. రైతుల శ్రమ, చెమట చుక్కకు ప్రభుత్వం విలువ ఇస్తోందని, ధాన్యం కొనుగోలు అయిన 7%-%10 రోజుల్లోపే వారి బ్యాంకు ఖాతాల్లో చెల్లింపులు జమ అవుతాయని నమ్మకమిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఈవో ముజాయిద్దీన్, పంచాయతీ కార్యదర్శి అనిల్, ఐకేపీ ఇన్‌చార్జిలు, బైరు శ్రీమతి నాయిని కోమలత, కవిత, సీసీ మీట్యా తండా మాజీ సర్పంచ్ నరేష్, మాజీ వార్డు సభ్యుడు బైరు శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొయ్యడి యాకాంతం, గ్రామ పార్టీ అధ్యక్షుడు తుమ్మన్నావుల్లి సతీష్, రైతు నాయకులు గుండ్ల ఉప్పన్న, భూక్యా ప్రభాకర్, బిచ్చ చంద్రమౌళి, గుగులోత్ శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయల ధరలకు అడ్డూ అదుపూ లేదు అయ్యప్ప భిక్ష ఎలా

**మార్కెట్‌కి వెళ్లిన భక్తులకు రేట్ల**

**షాక్ -కొనాలన్నా చేతికందని పరిస్థితి**

**కార్తీకమాసం-మాలధారణలో స్వాముల భిక్ష**

**కోసం సరుకుల సేకరణ కష్టసాధ్యం**

**అల్పాహారానికి కావాల్సిన సాధారణ**

**కూరగాయలకే నిండా పెరిగిన ధరలు**

**100 రూపాయలు పెట్టినా రెండు కూరగాయలు**

**రాకపోతున్నాయి” అని మధ్యతరగతి ఆడబిడ్డల**

**ఆవేదన**



**తొలి అక్షరం ఇనుగుర్తి నవంబర్ 17**నెల్లికుదురు ఇనుగుర్తి మండలం కూరగాయలు బగ్గు మంటున్న పరిస్థితి ఇప్పుడు కార్తీకమాసం ప్రారంభంతో అయ్యప్ప స్వాములు మాలలు ధరించి దీక్షలో ఉన్నారు. ఈ సందర్భంగా స్వాములకు భిక్ష సిద్ధం చేయడానికి కుటుంబాలు మార్కెట్‌కి వెళు_న్నా%ొ% అక్కడ కనిపిస్తున్న కూరగాయల ధరలు భక్తులకు అసలైన పరీక్షగా మారాయి.టమోటా, ఉల్లిగడ్డ, దొండకాయ, బీరకాయుఏది చూసినా ధరలు అంతకంతకు పెరిగి సాధారణ కుటుంబాలకి అందని ద్రవ్యంలా మారిపోయాయి. భిక్ష కోసం అవసరమైన సరుకులు కొనాలంటే సంచిని నింపకముందే జేబు ఖాళీ అవుతున్న పరిస్థితి.ముఖ్యంగా మధ్యతరగతి ఆడబిడ్డలు ఆవేదన వ్యక్తం చేస్తూ,“ఈరోజుల్లో 100 రూపాయలు పెట్టినా రెండు కూరగాయలు కూడా ఇంట్లోకి రాకపోతున్నాయి. భిక్ష కోసం కావాల్సిన అన్నీ ఎలా సర్దుబాటు చేద్దాం?” అంటూ బాధపడుతున్నారు.

స్వాములకి అల్పాహారం, పౌష్టికాహారం సిద్ధం చేయాలన్న భక్తి ఉన్నామార్కెట్‌లో అదుపు తప్పిన కూరగాయల ధరలు భక్తులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి.

ధరలు ఇలాగే కొనసాగితే అయ్యప్ప భిక్ష కార్యక్రమాలకే భారమయ్యే పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### మాలధారణలో భిక్ష పెట్టడం పెద్ద భారంగా మారింది



మాల వేసుకున్న అయ్యప్ప స్వాములకు కూరగాయల ధరలు భారీగా పెరగడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భిక్ష కోసం సరుకులు సేకరించడం ఇప్పుడే పెద్ద కష్టంగా మారిందని స్వాములు చెబుతున్నారు.ఏ కూరగాయైనా వంద రూపాయలకు పైనే ఉండడం భక్తులను అయోమయంలో పడేస్తోంది.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధరలను అదుపులోకి తేవాలని వారు కోరుతున్నారు.

**–చిన్ననాగారం పోలోజు నరేష్ స్వామి**

## ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య







తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 17:యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని 5వ వార్డులో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.5వ వార్డుకు చెందిన కళావతి రమేష్ లబ్ధిదారుల యొక్క సొంత ఇంటి కల నెరవేర్చి ఈరోజు గృహప్రవేశం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం బీర్ల ఫౌండేషన్ చైర్ పర్సన్ బీర్ల అనిత చేతుల మీదుగా పట్టుబట్టలు పెట్టారు.అదేవిధంగా యటా పొట్టేలును అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



తొలి అక్షరం మహబూబాబాద్ బ్యూరో నవంబర్ 17. సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని భారత కమ్యూనిస్టు పార్టీ పురపాలక సంఘ మాజీ ఫ్లో లీడర్ బి అజయ్ సారధి కోరారు. పురపాలక సంఘ పరిధిలోని 36వ వార్డు ఏ క్యాబిన్ వద్ద రోడ్డు ఆక్రమణ, మురుగునీటి కాలువలు, రోడ్డు సౌకర్యం కల్పించాలని తదితర సమస్యలపై సోమవారం పట్టణ ప్రణాళిక అధికారితో కలసి స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వార్డు పరిధిలోని సమస్యను టౌన్ ప్లానింగ్ అధికారులకు వివరిస్తూ ఈ ప్రాంతంలో నిత్యం వేలాదిమంది ప్రజల రాకపోకలు ఈ ప్రాంతం నుంచే కొనసాగుతుంటాయని ఈ ప్రాంతంలో రోడ్డు, డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని రోడ్డు ఆక్రమణ కాకుండా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కాపాడాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా 36వ వార్డులో ఉన్న ప్రధాన సమస్యలన్నీటిని పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు కృషి చేయాలని కోరారు. స్పందించిన టౌన్ ప్లానింగ్ అధికారులు తదితర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి ప్రవీణ్ వార్డు ఆఫీసర్లు భారత రమేష్, శ్యామ్ గాదం శ్యాం ప్రసాద్ యాదవ్ సింగం విష్ణు తల్లు తదితరులు పాల్గొన్నారు.

## కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరాహార దీక్ష



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 17:ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టరేట్ సమీపంలో భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు రైతన్నల యోగక్షేమాల రక్షణ కోసం నిరాహార దీక్ష చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వరంగల్ డిక్లరేషన్లో పేర్కొన్న హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఉద్యమం నిర్వహించారు.వరంగల్ రైతు భరోసా ప్రతి రైతుకి ప్రతి ఎకరాకు 15000 ఇందిరమ్మ రైతు భరోసా కౌలు రైతులకు ఎకరాకు 15 000 ఏమాయే గుంట భూమిలేని రైతు కూలీలకు ఏటా 15000 ఈమాయి వరికి. పత్తికి ప్రతి పంటకు 500 బోనస్ ఏమాయే ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నకిరేకంటి. మొగులయ్య ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్టేట్ కౌన్సిల్ మెంబర్ వన్ అంజయ్య మండల పార్టీ అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డిరామన్నపేట మండల ప్రధాన కార్యదర్శి జంగిలి సత్యనారాయణ యాదవ్ తదితరులు పాల్గొనడం జరిగింది

## రామన్నపేట ప్రభుత్వ హాస్పిటల్ ను వంద పడకలుగా మార్చాలి

## నకిరేకంటి .నరేష్ బీఎస్పీ మండల అధ్యక్షులు రామన్నపేట



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 17:రామన్నపేట ఏరియా హాస్పిటల్ లో గతంలో చిరుమర్తి లింగయ్య శంకుస్థాపన చేసి వెళ్ళాడు ఇప్పటివరకు దాని నిర్మాణం చేయలేదు .100 పడక హాస్పిటల్ నిర్మాణం చేయాలని ఇప్పుడున్న ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోవాలి కోరుతున్నాం బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు నకరేకంటే నరేష్ తెలిపినారు

## చలో కరీంనగర్. టీఎం కెఎం కేఎస్ రాష్ట్ర మహాసభలు ను జయప్రదం చేయండి.



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 17: తెలంగాణ మత్స్య కారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర నాలుగవ మహాసభలను జయప్రదం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కన్వీనర్ కందుల హనుమంతు రామన్నపేట మండల కేంద్రంలో.పోస్టర్ ఆవిష్కరించి న సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 25న కరీంనగర్ లో జరిగే మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని. మత్స్య వృత్తి రక్షణ మత్స్యకారుల సంక్షేమ సామాజిక భద్రతకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వచ్చే బడ్జెట్లో 5000 కోట్లు కేటాయించి ఖర్చు చేయాలని. మత్స్య కార్ల జీవిత భద్రతకు ఇన్సూరెన్స్ ఎక్స్గ్రేషియా రూపాయలు ఇరవై 20 లక్షలు ఇవ్వాలి. రాష్ట్రవ్యాప్తంగా 10 హెూల్సేల్ 100 రిటైల్ చేపల మార్కెట్లు నిర్మించాలి మత్స్య సంపదకు గిట్టుబాటు ధర కల్పించాలి ప్రతి మత్స్య సొసైటీకి 10 లక్షల ఆర్థిక సాయం చేయాలి చెరువుకుంటలు జల వనరులు కబ్జా కాలుష్యం నుండి కాపాడాలి శాటిలైట్ ద్వారా సర్వే చేసి ఎఫ్ టి ఎల్ హద్దురాళ్ళను ఏర్పాటు చేయాలి మత్స్య మహిళా గ్రూపుల స్కీమ్ పునరుద్ధరించాలి గ్రూపుకు 10 లక్షల ఆర్థిక సాయం చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మత్స్య మహిళ సొసైటీ ఉపాధ్యక్షులు రేపాక పోచమ్మ యాట భాగ్యమ్మ డైరెక్టర్ కందుల లలిత కందుల లక్ష్మి కందుల రాములమ్మ కేశబోన ఇందిరమ్మ యాటా అనసూయ యట నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు

## మునిపంపుల- పల్లివాడ గ్రామాలకు గ్రామ పాలనాధికారి (జిపిఓ)ను కేటాయించాలి

**జిపిఓ లు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు**

**సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం**



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 17: మునిపంపుల,పల్లివాడ గ్రామాలకు గ్రామ పాలనాధికారి (జిపిఓ )ను కేటాయించి ప్రజల సమస్యను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి నగేష్ ప్రభుత్వ యంత్రాంగన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ లాల్ బహదూర్ కు వినతి పత్రం అందజేసి అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు నెలకొంటున్న సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు క్షేత్రస్థాయిలో పరిపాలన అందించేందుకు ఇటీవల ప్రభుత్వం నియమించిన గ్రామ పాలనాధికారులు(జిపివో) అనుమండలంలో అన్ని గ్రామాలకు కేటాయించి ఈ రెండు గ్రామాలకు కేటాయించకపోవడంతో వివిధ ధ్రువీకరణ పత్రాలు,రెవిన్యూ సమస్యలు పరిశీలన చేసేవారు లేక ప్రజల స్థానిక తహసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. మండలంలో అన్ని గ్రామాలకు జిపిఓలను కేటాయించి ఈ గ్రామాలకు కేటాయించకపోవడం సరికాదని వెంటనే ప్రభుత్వం స్పందించి మునిపంపుల-పల్లివాడ గ్రామాలకు గ్రామ పరిపాలన అధికారులను కేటాయించి ప్రజల సమస్యను పరిష్కారం చేయాలని అన్నారు. లేనిపక్షంలో గ్రామాల ప్రజలతోటి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యుడు తొలుపునూరి శ్రీనివాస్,గ్రామ శాఖ నాయకత్వం మేడి ముకుంద, బూడిద మధు, తుర్కపల్లి నరేష్, బూడిద గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డకు పూసమెట్టల వితరణ

**సదర్ శీను సేవా దృక్పథానికి ప్రశంసలు**



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 17కొందుర్గు మండల కేంద్రంలోని మట్పూర్ గ్రామానికి చెందిన బొమ్మ సుశీల, వెంకటయ్య దంపతుల కుమారుడు అనిల్ మరియు అంకితల వివాహ మహొత్సవం సందర్భంగా, బిసి సేన జిల్లా అధ్యక్షుడు సదర్ శీను పూసమెట్టలను అందజేశారు. ఈ సందర్భంగా సదర్ శీను మాట్లాడుతూ...ఆడబిడ్డ పుట్టడం ఇంటిలో లక్ష్మీదేవి ఆగమనంతో సమానం.ఆడబిడ్డల జననాన్ని సంతోషంగా స్వాగతించాలి. వారికి అండగా నిలిచి, ప్రోత్సహించే సంస్కృతిని ప్రతి కుటుంబం అలవర్చుకోవాలి.మన సాంప్రదాయంలో పూసమెట్టలు ఆశీర్వాదాల సంకేతం. ఈ కార్యక్రమం ద్వారా ఆడబిడ్డల పట్ల ప్రేమ, గౌరవం మరింత పెరగాలని ఆకాంక్షించారు.సదర్ శీను యొక్క సేవాభావం, మానవతాదృక్పథాన్ని స్థానికులు హర్షించారు.ఆడబిడ్డ పుట్టిన ప్రతి ఇంటికీ ఇలాంటి ప్రోత్సాహం అందించడం సమాజంలో సానుకూల అవగాహన విస్తరిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. వధూవరులను ఆశీర్వదించిన అతిథులు, పెద్దలు ఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు.సదర్ శీను యొక్క ఈ చొరవ ఆడబిడ్డల పట్ల సమాజంలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించే దిశగా ఒక ముందడుగుగా నిలిచింది.

## బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ని సన్మానించిన తెలంగాణ మంత్రి వాకాటి శ్రీహరి



తెలంగాణ బ్యాడ్‌మెంటన్ అసోసియేషన్ అధ్యక్షులు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెసు కమిటి ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ని హన్మకొండ లో సన్మానించిన తెలంగాణ రాష్ట్ర క్రీడలు,పశు సంవర్ధక,మత్స్య శాఖా మంత్రి వాకాటి శ్రీహరి. ఈ సందర్భముగా మంత్రి వాకాటి శ్రీహరి మాట్లాడుతూ... బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో జిల్లాలో బ్యాడ్‌మెంటన్ షటిల్ క్రీడల అభివృద్ధికి తనదైన శైలితో పనిచేస్తూ యువ క్రీడా కారులను ప్రోత్సాహించడము తో పాటు దేశంలో జరిగే జాతీయ షటిల్ పోటీ క్రీడల్లో స్వతహాగా పాల్గొనడం, వరంగల్ హన్మకొండ జిల్లాల నుండి ఇతర క్రీడాకారులను అధిక సంఖ్యలో తెలంగాణ రాష్ట్ర పక్షాణ పాల్గొనేలా ప్రతి క్రీడాకారుల్ని ప్రోత్సహించడం అభినందనీయమని వాకాటి శ్రీహరి తెలపారు.తెలంగాణ ప్రభుత్వం క్రీడల పైన ప్రత్యేక శ్రద్ధతో అధిక బడ్జెట్ కెటాయించి, మౌళిక వసతుల ఏర్పాటు చేయడం జరుగుతుందని, వివిద క్రీడల్లో రాణించిన క్రీడాకారులను తగిన గుర్తింపు ఇస్తూ ప్రభుత్వం ప్రోత్సహించడం జరిగితుందని తెలిపారు.

# పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

**20,21,22 న జిల్లాలో బస్సు జాతను జయప్రదం చేయండి**

**సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి**



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 17:**1925 డిసెంబర్ 26న కాన్పూర్ లో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఖమ్మంలో డిసెంబర్ 26న భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఈ భారీ బహిరంగ సభను జయప్రదం చేయడానికి రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు జాత ఈనెల 20 21 22 తేదీలలో జిల్లాలో అన్ని మండలాలు తిరుగుతుందని ఈ బస్సు జాతను డప్పులు, కళాకారులతో ఘన స్వాగతం పలికి సభలు నిర్వహించి సిపిఐ పోరాట చరిత్రను ప్రజలకు వివరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం రోజున ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని జె.ఏ.ఎస్ ఫంక్షన్ హాల్లో జరిగిన మండల కౌన్సిల్ సమావేశానికి దామోదర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి రైతుల ఇబ్బందులను తొలగించాలని, స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చిన సిపిఐ సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని స్వాతంత్ర ఉద్యమంలో అగ్ర బాగాన నిలబడి పోరాటం చేసింది.అదేవిధంగా భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం పోరాటాలు నిర్వహించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని 4వేల కమ్యూనిస్టుల బలిదానం తో 10 లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిన చరిత్ర అని గుర్తు చేశారు.ఈ దేశంలో ఎదుర్కొంటున్న కార్మిక కర్షక విద్యార్థి నిరుద్యోగ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పోరాటాలు చేస్తున్నదని అయన అన్నారు. సిపిఐ(100 సంవత్సరాల)శతజయంతి ఉత్సవాల ముగింపు బహిరంగ డిసెంబరు 26న ఖమ్మంలో నిర్వహిస్తున్న బహిరంగసభకు యాదాద్రి భువనగిరి జిల్లా నుండి పార్టీ సభ్యులు, సానుభూతి పరులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.మరుపాక వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశ%శీ%లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, ఎండీ ఇమ్రాన్, చేనేత కార్మిక సంఘ%శీ% రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మినర్సయ్య, మండల సహాయ కార్యదర్శి ఎండీ నయీమ్, రైతు సంఘం జిల్లా నాయకులు జక్క దయాకర్ రెడ్డి, చేనేత సంఘం జిల్లా నాయకులు జెల్ది రాములు, నాయకులు సుల్తాన్ పూరషోతం, యాస బుచ్చి రెడ్డి, ఆంబోజి రాములు, దుర్గాపతి నర్సయ్య, మరుపాక అంజయ్య, సోమనబోయిన నర్సింహా,తదితరులు పాల్గొన్నారు.

# భలే.. కృష్ణుడి కమనీయ గానాల విందు.. ఆద్యంతం భలే పసందు..!

**అలరించిన సూపర్ స్టార్ కృష్ణ పాటల గానామృతం..**

**ప్రత్యేకంగా నిలిచిన గాయనీ గాయకుల పాటలు..**

**శ్రీ సరస్వతి కళాపీఠం ఆధ్వర్యంలో కార్యక్రమం..**

**సూపర్ స్టార్ కృష్ణకు ఘన నివాళి..**

**ముఖ్య అతిథులుగా ఎండి ఖాదర్ గోరి, దిడ్డి రాంబాబు, ప్రొడ్యూసర్ సిరాజ్, కృష్ణ అభిమానులు**

**ఎస్.ఎస్.కే.పి అధినేత్రి మధిర రోజా తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమం..**

**డొక్కా సీతమ్మ సినిమాలో "రోజా మదిర"కు పాట పాడే అవకాశం కల్పించిన ప్రొడ్యూసర్స్ సిరాజ్, ఖాదర్ గోరి**







**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 17**

ఘణా ఘన సుందరా అంటూ భక్తిపారవశ్యంలో ముంచెత్తారు.. నమస్తే సుస్వాగతం.. అంటూ అభిమానులను ఆహ్వానించారు.. విశాల గగనంలో చందమామను చూస్తూ.. చుక్కల తోటలో విహరింప చేశారు.. చాంగు భళా బాగుంది కదా తమ జోరు.. అంటూ అభిమానులు మెచ్చేలా.. వందనాలు.. వందనాలు అంటూ ప్రేక్షకులు చప్పట్లు కొట్టేలా సాగిన సూపర్ స్టార్ "భలే కృష్ణుడి" గానామృతం ఆద్యంతం కన్నుల విందు చేసింది.. శ్రీ సరస్వతి కళాపీఠం (ఎస్.ఎస్.కే.పి) ఆధ్వర్యంలో నిర్వాహకులు ఈలపాట గాన కోకిల రోజా మధిర, ఎంవిజీవి రావు దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్ స్టార్, నట శేఖర్ కృష్ణ సినిమాలోని అద్భుతమైన పాటలను కళాకారులు ఆవిష్కరించారు. ప్రముఖ ఈల గాయనీయమని రోజా మధిర, కళాకారుడు, గాయకుడు జర్నలిస్టు ఎం.డి ఖాజాపాషా (కేపీ)తోపాటు రత్న కుమారి, రమణి, మాధవి, శ్రీరాణి, చందన, జనశ్రీ రెడ్డి, రామానంద, ప్రసాద్, కృష్ణ విహారి, మోహన్, ప్రణయ్, చిరంజీవి, క్రాంతి, ప్రేమ్ రాజ్, ట్రాక్ సుదర్శన్ తదితరులు ఆలపించిన పాటలు ఎంతగానో అలరించాయి. ముందుగా సూపర్ స్టార్ కృష్ణకు నివాళులు అర్పించిన ముఖ్య, విశిష్ట అతిథులు కృష్ణ మహేష్ ప్రజా సేన ఆల్ ఇండియా అధ్యక్షులు ఎండి ఖాదర్ గోరి, మరో సీనియర్ అభిమాని మాజీ కార్పొరేటర్ దిడ్డి రాంబాబు, డొక్కా సీతమ్మ సినీ ప్రొడ్యూసర్ సిరాజ్, పద్మాలయ స్టూడియో పిఆర్ఓ శర్మ, విజయవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు భావనారాయణ, విశిష్టాధితులు పరుచూరి విజయలక్ష్మి, విదుషిమని ప్రసూన ఇంకా హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల నుండి కృష్ణ ముఖ్యమైన అభిమానులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సినీ రంగానికి సూపర్ స్టార్ కృష్ణ ఆయన చేసిన సేవలను, సినీ రంగంలో ఆయన సాహసాలను కొనియాడారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆల్ ఇండియా కృష్ణ ప్రజాసేన అధ్యక్షులు ఎండి ఖాదర్ గోరి మాట్లాడుతూ చిన్నతనం నుండి సూపర్ స్టార్ కృష్ణ గారు అంటే తనకు ఎంతో అభిమానం అని, ఆయన పాటలు ఎన్నిసార్లు విన్న పరవశించి పోతుంటానని అన్నారు. కృష్ణ 3వ వర్ధంతిని పురస్కరించుకొని ఇంత మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆయన అన్నారు. హీరో కృష్ణ పాటలను ఆలపించిన ప్రతి ఒక్కరిని ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. శ్రీ సరస్వతి కళాక్షేత్రం నిర్వాహకురాలు త్రిబుల్ ఆర్ఎం లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ముందుగా సూపర్ స్టార్ కృష్ణకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

**ఈ పాటలూ.. పంచామృతమే..**

హీరో కృష్ణ గారి పాటలు మాత్రమే కాకుండా ఇతర పాటలతో కూడా కెపి అలరించారు. ఇతర గాయని మణులు కూడా ఆయా పాటలకు తమ గాత్రాన్ని అందించారు. శ్రీరాణి కలిపి పాడిన సూపర్ స్టార్ కృష్ణ పాటలు ఎంతగానో అలరించాయి. గాయని గాయకులు అనేక పాటలు పాడి ఆకట్టుకున్నారు. అదేవిధంగా సోలోగా ముద్దమందారం సినిమాలోని ముద్దుకే ముద్దొచ్చే మందారం.. అనురాగ దేవత నీవే, నవ్వుతూ బతకాలి రా తమ్ముడు పాటలతో పాటు ప్రసాద్ పాడిన నా పేరు బికారి, వంటి పాటల ద్వారా ఆకట్టుకున్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా తెలుగు సినీ రంగానికి సేవలు అందించి ఉన్నత స్థాయికి తీసుకువెల్లిన సూపర్ స్టార్ కృష్ణకు గాన కళాకారులంతా కలిసి ఆయన పాటల రూపంలో ఇచ్చిన ఘన నివాళి ఓ మధురానుభూతిగా మిగిలిపోతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

**డొక్కా సీతమ్మలో రోజా మధిరకు ఛాన్స్**

కార్యక్రమానికి హాజరైన డొక్కా సీతమ్మ సినిమా ప్రొడ్యూసర్స్ సిరాజ్, ఎండి ఖాదర్ గోరిలు రోజా మధిరకు ఒక పాట పాడే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు కార్యక్రమంలో ప్రకటించారు. సూపర్ స్టార్ కృష్ణ గారి పాటలను ఎంతో అద్వితీయంగా పాడి ఆయనకు అంకితం చేయడం వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకోవడం ఎంతగానో నచ్చిందని శ్రీ సరస్వతి కళా పీఠం నిర్వాహకులకు వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లప్పుడు శ్రీ సరస్వతి కళా పీఠానికి కృష్ణ మహేష్ ప్రజాసేన సంఘం తరపున సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. తమ నిర్మిస్తున్న డొక్కా సీతమ్మ సినిమాలో రోజా మదిరకు ఒక పాట పాడే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా జర్నలిస్టు కేపీకి, రోజా మధిరకు రాబోయే తదుపరి చిత్రాలలో నటనకు అవకాశం కల్పిస్తామని తెలిపారు.

**పాటల పూతోటలో ఎస్.ఎస్.కే.పి బృందం..**

ఏ పాట పాడిన తన అద్భుతమైన గానంతో అలరించడం గాయని గాయకుల ప్రత్యేకత. అలాంటిది ఎంతగానో ప్రజలు అభిమానించే సూపర్ స్టార్ కృష్ణ పాటలు అంటే ఇంకా వేరే చెప్పాలా.. ప్రతి పాటతో తమదైన శైలిలో మ్యాజిక్ పై గాన బృందంతో కలిసి అభిమానులను అలరించారు. కార్యక్రమంలో భాగంగా అందరూ ఎంచుకున్న పాటలు కూడా కృష్ణ కెరియర్ లోనే ఆల్ టైం హిట్స్. ముందుగా భక్తతుకారం సినిమాలోని ఘణా ఘన సుందర భక్తి పాటతో మొదలుపెట్టిన తరువాత కిరాయి కోటిగాడు సినిమాలోని నమస్తే సుస్వాగతం పాటతో హీరో కృష్ణ పాటలకు శ్రీకారం చుట్టారు. గాయని రోజాతో కలిసి ఈ పాటను ఆలపించారు. ఇక తర్వాత మహాబలుడు సినిమాలోని విశాల గగనంలో చందమామ పాటను గాయని రత్న కుమారితో కలిసి ఆలపించారు. గాయని మాధవి తో కలిసి కురుక్షేత్రం సినిమాలోని మ్రోగింది కళ్యాణ వీణ, పచ్చని కాపురం సినిమాలోని వెన్నెలైనా చీకటైనా.. చుట్టాలున్నారు జాగ్రత్త సినిమాలోని రెక్కలు తొడిగి రెపరెపలాడి.. నెంబర్ వన్ సినిమాలోని సాంగ్ చాంగ్ భళా బాగుంది కదా తమ జోరు.. ఏజెంట్ గోపి చిత్రంలోని హంస భలే రామచిలక ఓలమ్మి.. మాటలతో ఆకట్టుకున్నారు. శ్రీరాణితో కలిసి చుక్కల తోటలో ఎక్కడున్నావో పాటతో పాటు సింహాసనం చిత్రంలోని వాహ్వా నీ యవ్వనం.. ప్రజారాజ్యం చిత్రంలోని గోపాలుడు వస్తే గోపెమ్మ నవ్వే.. వంటి పాటలు పాడారు.. ఆకాశంలో ఒక తార రోజా మధిరతో పాడగా అదే విధంగా ఇలా గానంతో అన్నదమ్ముల సవాల్ నాకోసమే నీవున్నది పాట అలరించారు. ఇక సోలోగా కుమార రాజా సినిమాలోని అనురాగ దేవత నీవే.. మాయదారి మల్లిగాడు సినిమాలోని నవ్వుతూ బ్రతకాలి రా.. పాటలతో దుమ్మురేపారు. ఈ సందర్భంగా శ్రీ సరస్వతి కళా పీఠం తరపున ముఖ్య అతిథులకు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు అదేవిధంగా గాయని గాయకులకు ఎండి ఖాదర్ గోరి ప్రత్యేక సన్మానాలు చేసి అభినందించారు.

### టీఎస్ యుటిఎఫ్12వ మండల మహాసభలను విజయవంతం చేయండి-జిల్లా కార్యదర్శి డిఎస్.నాగేశ్వరరావు




**తొలి అక్షరం/ ఏన్కూర్ 17 నవంబర్** ఈనెల 19 తారీకు బుధవారం నాడు స్థానిక మండల కేంద్రంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏన్కూర్ పాఠశాల కూరపాటి పాండురంగయ్య ప్రాంగణంలో నిర్వహించబోతున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) ఏన్కూర్ మండల శాఖ12వ. మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి డిఎస్. నాగేశ్వరరావు ఉపాధ్యాయులను కోరారు. మండల అధ్యక్షులు బానోత్ రామచంద్ అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ మహాసభకు ఉపాధ్యాయులు,సంఘ సభ్యులు,కార్యకర్తలు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో హాజరై కమిటీ పనితీరుపై చర్చించాలని, భవిష్యత్ కర్తవ్యాలను నిర్ణయించుకోవాలని, ఉపాధ్యాయులకు మంచి సర్వీస్ అందిస్తూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఎల్లవేళల కృషి చేయాలని అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మూడ్ పుల్లయ్య,ఉపాధ్యక్షులు జె.పుల్లయ్య,శ్రీదేవి, రాఘవరావు,నరసింహారావు,శంకర్రావు,నాగేశ్వరరావుశ్యాం కుమార్, సింగ్యా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### వెల్లంకి-గుండ్రాంపల్లి రోడ్డు పునర్నిర్మించాలని వినతి



**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 17**:రామన్నపేట మండలం వెల్లంకి-సుంకెనపల్లి-గుండ్రాంపల్లి(%చీఎ%-65) రోడ్డు ధ్వంసమై ఇబ్బంది పడుతున్నామని, పునర్నిర్మాణం చేపట్టాలని వెల్లంకి వాసులు అదనపు కలెక్టర్ వీరారెడ్డిని ప్రజావాణిలో కోరారు. ఆయన స్పందించి జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ దాసయ్యకు సమస్యను తెలియజేశారు. గ్రామస్థులతో దాసయ్య మాట్లాడుతూ.. 'రోడ్డు సాంక్షన్ అయ్యింది. 6కీమీలకు రూ.1.90 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్ట్ ఓకే అయింది. వీలైనంత త్వరగా పనులు ప్రారంభిస్తాం' అని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో డా.నకిరేకంటి అశోక్, నకిరేకంటి ఉపేందర్, జినుక స్వామి, గూని రాజు, జినుక గోవర్ధన్, చేగూరి మంజుల, బర్ల రవి, తలారి కళావతి, జినుక మహేష్, నకిరేకంటి రమేష్, జినుక నాగరాజు, బర్ల మహేష్, చేగూరి అనుశ్, తలారి గణేష్ ఉన్నారు.

### ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప ఎలికట్ట భవాని మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు



**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 16**రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల్ సరదా నగర్ గ్రామంలో అయ్యప్ప దీక్షలో భాగంగా భవాని మాత దేవాలయంలో అభిషేకం మరియు ప్రత్యేక పూజలో...శశాంక్ రెడ్డి గురు స్వామి, కార్తీక్ కన్య స్వామి, తదితరులు పాల్గొన్నారు.

### గుండాల సతీష్ కుటుంబ సభ్యులను పరామర్శించిన దైద రవీందర్కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి






**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 17:**రామన్నపేట మండలం దుబ్బాక గ్రామ సీనియర్లి కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుండాల సతీష్ గౌడ్ తండ్రైన గుండాల సోమయ్య ఇటీవల మరణించడంతో వారి దశదిన కర్మ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించినదైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# షాద్ నగర్ లోదళిత యువకుడి కుల దురహంకార హత్య

**కిడ్నాప్ హత్య పెట్రోల్ పోసి నిప్పటించిన కులోన్మాదులు**

**మోయినా బాద్ పోలీసుల వేధింపులు నిర్లక్ష్యం వల్లే ఈ హత్య**

**ఎర్ర రాజశేఖర్ ను హత్య చేసిన హంతకులను కటినంగా శిక్షించాలి**

**కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు**

**కులనిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి వహీద్**





**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 17**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందినదళిత యువకుడు ఎర్ర చంద్ర శేఖర్ ప్రేమ వివాహం చేసుకున్నాడని అతని సోదరుడు ఎర్ర రాజశేఖర్ ను కిడ్నాప్ చేసి హత్య చేసి పెట్రోల్ పోసి తగలబెట్టిన వధువు తండ్రి కావలి వెంకటేష్ పాత్రధారులు సూత్రధారులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు, కుల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి వహీద్ రాష్ట్ర పోలీసు ఉన్నత అధికారులను డిమాండ్ చేశారు .ఆదివారం షాద్ నగర్ నియోజక వర్గం ఎల్లంపల్లి గ్రామములో ఎర్ర రాజశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు అంతక్రియలో పాల్గొన్నారు షాద్ నగర్ చౌరస్తాలో జరిగిన భారీ రాస్తారోకోలో కేవీపీఎస్ కేఎన్ఎస్ సామాజిక సంఘాల కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గత నెల రోజుల క్రిందట ఎర్ర రాజశేఖర్ భవాని ప్రేమించుకుని చట్టబద్ధంగా మేజర్లు కావడంతో వివాహం చేసుకున్నారని దీనిని జీర్ణించుకోలేని వధువు తండ్రి కావలి వెంకటేష్ మొయినాబాద్ పోలీసుల సహాయంతో పోలీస్ స్టేషన్లోని ఎర్ర చంద్రశేఖర్ తండ్రిపై అన్న జగన్ పై దాడి చేశాడని చెప్పారు ఆరోజు పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని పోలీసులు సైతం కొట్టారని అదే అలుసుగా తీసుకున్న కావలి వెంకటేష్ ఈ కులాంతర వివాహానికి ఎర్ర రాజశేఖర్ పూర్తిగా సహకరించాడనే ఉద్దేశంతో మాటుగాసి మాట్లాడుకుందాం రా అని పిలిచి నవాబుపేట ఏరియాలో విపరీతంగా కొట్టి హత్య చేసి సజీవ దహనం చేయటం మానవ మృగాలుగా క్రూర హత్యకు పాల్పడ్డారని చెప్పారు రాష్ట్రంలో కుల దురహంకార హత్యలు 142 కు చేరుకున్నాయని పోలీసుల యొక్క నిర్లక్ష్యం పోలీసులు చట్టాన్ని ఉల్లంఘించడం వల్ల జరుగుతున్న వరుస కుల దురహంకార హత్యల్లో భాగమేనని చెప్పారు కుల దురహంకారంతో మానవ మృగాలుగా ప్రవర్తిస్తూ నవ యువకులను బలి తీసుకుంటున్నారని చెప్పారు ఇటీవల కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కోడలునీ మామ హత్య చేయటం, షాద్ నగర్ లో అన్నను హత్య చేయటం దారుణమన్నారు. ఈ కుల దురహంకార హత్యలను రాష్ట్ర ప్రభుత్వం ఉపేక్షిస్తుందన్నారు కులాంతర వివాహితులకు ప్రత్యేక రక్షణ చట్టం చేయడం లేదన్నారు. ఈ హత్యలో కేవలం వధువు తండ్రి ఒక్కడే కాదని ఈ హత్య వెనుక అనేకమంది ఉన్నారని చెప్పారు ఇలాంటి కుల దురహంకారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు రాష్ట్రంలో మరో కుల దురహంకార హత్య జరగకుండా చట్టరీత్య చర్యలు తీసుకోవాలన్నారు ఇప్పటికైనా పోలీసులు తమ ప్రవర్తన మార్చుకొని చట్టబద్ధంగా మేజర్లైన ప్రతి ఒక్కరికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు పోలీసుల రక్షణ వైఫల్యం కారణంగా జరుగుతున్న హత్యలను నివారించాలని చెప్పారు ముందర నుంచి మేజర్ అయిన ప్రతి యువతి యువకులు తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకుని స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిందన్నారు దానిని ఎలా ఉల్లంఘిస్తారని చెప్పారు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ బాధిత కుటుంబాన్ని పరామర్శించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించాలని డిమాండ్ చేశారు బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలన్నారు రాజశేఖర్ జీవిత సహచరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆమె కుటుంబానికి 50 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియో చెల్లించాలని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కిడ్నాప్ కేసు మాత్రమే కాకుండా హత్యానేరంతో పాటు ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు . కుల దురహంకార హత్యలు జరిగినప్పుడు ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం వల్ల ఈ హత్యలు పెట్రేగిపోతున్నాయన్నారు ఈ కార్యక్రమంలో ఆలిండియా సమతా పార్టీ ప్రెసిడెంట్ దానక్క సంగమేశ్వర్ కెవిపిఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం ప్రకాష్ కరత్ కుల నిర్మూలన సంఘం ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి చింతపల్లి ప్రభాకర్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ రాజు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్ తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఘనంగా కళా కార్ తెలుగు టీవీ అవార్డ్స్ - 2025





**-పండిత్ జవహర్ నెహ్రూ అవార్డు అందుకున్న కొరియో గ్రాఫర్ అన్వర్**

**ఈ అవార్డు మరింత బాధ్యత పెంచింది**

**తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 17**హైదరాబాద్ మరోసారి కళా సాంస్కృతిక మహోత్సవానికి వేదికైంది. పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ 136వ జయంతి సందర్భంగా నిర్వహించిన 'కళా కార్ తెలుగు టీవీ అవార్డ్స్-2025' కార్యక్రమం ఆదివారం ఘనంగా, వైభవోపేతంగా జరిగింది.రాష్ట్రవ్యాప్తంగా కళారంగంలో ప్రతిభ చాటిన వారికి, యువ నేటి తరం కళాకారులకు ఈ సందర్భంగా అవార్డులు అందజేశారు.నాట్యరంగంలో తనదైన ముద్ర వేసిన కొరియోగ్రాఫర్ అన్వర్‌కు 'ఉత్తమ కొరియోగ్రాఫర్' అవార్డు లభించింది. విభిన్న నృత్య శైలులను అద్భుతంగా మలిచి ప్రేక్షకులను ఆకట్టుకున్న అన్వర్ ప్రతిభను వేదికపై అందరూ కొనియాడారు. అవార్డు అందుకున్న అన్వర్ భావోద్వేగంతో మాట్లాడుతూ...ఈ గుర్తింపు నాపై మరింత బాధ్యతను మోపింది. నన్ను ప్రోత్సహించిన గురువులకు, నా టీమ్‌కు, ప్రేమతో చప్పట్లు కొట్టి ముందుకు నడిపించే ప్రేక్షకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. రానున్న రోజుల్లో మరింత మెలికలు తిరిగిన నాట్య రూపకాలను అందించేందుకు కృషి చేస్తున్నానని హామీ ఇచ్చారు.

అదే వేదికపై జీ తెలుగు ఛానెల్ డాన్స్ కాంటెస్ట్‌లో అదరగొట్టిన చిన్నారులు సోహన్, అన్విక, ప్రణీత్‌లకు ప్రత్యేక అవార్డులు లభించాయి. చిన్న వయసులోనే అద్భుత సమన్వయం, శ్రద్ధ, నైపుణ్యం ప్రదర్శించిన ఈ ముద్దు నర్తకులను నిర్వాహకులు ప్రశంసా వర్షం కురిపించారు.కార్యక్రమానికి హాజరైన టెలివిజన్ ప్రముఖులు మాట్లాడుతూ...కళాకారుల కష్టానికి గుర్తింపు లభించడం ఎంతో ఆనందదాయకం. యువతలోని ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి వేదికలు అవసరమని అభిప్రాయపడ్డారు.

అవార్డు గ్రహీతలంతా ఒక్కటే అన్నారు.మన తెలుగు కళలకు ఇంతటి గౌరవం దక్కడం గర్వకారణం. ఇక ముందు మరింత కృషి చేసి రంగాన్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తామని ధీమా కనబరిచారు.కళా%-%సాంస్కృతిక రంగాలకు నూతన ఊపిరి పోసిన ఈ వేడుక హైదరాబాద్‌కు మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# మల్లన్న నీ సన్నిధానం అభివృద్ధి జరిగేనా?



**అభివృద్ధికి ఆమడ దూరంలో**

**చిన్న శ్రీశైలం (మల్లన్న గుట్ట)**

**మల్లన్న గుట్టపై పోటెత్తిన జనం**

**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 17:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని నిదానపల్లి గ్రామంలో వెలసిన స్వయంభూ భ్రమరాంబ మల్లికార్జున ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా భక్తుల రద్దీ తారాస్థాయికి చేరింది. కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయ ప్రాంగణం వైపు పోటెత్తారు.ఆలయ పరిసరాల్లో భక్తజనం




ఉత్సాహం ఉదయం నుంచే శివలింగాభిషేకాలు, ప్రత్యేక పూజలు, కార్తిక దీపాల రాణి కార్యక్రమాలు ఆలయంలో నిర్వహించడంతో భక్తుల సందడి ముమ్మరంగా మారింది. మహిళలు ఆలయాల ముందా కార్తిక దీపాలను వెలిగించి,



శివుడికి నమస్కారార్చనలు చేశారు, పుణ్యస్నానాలు, ఉపవాసాలు, పారాయణలు, శివనామస్మరణలతో ఆ ప్రాంగణం మారుమోగిపోయింది. "ఓం నమః శివాయ" నినాదాలతో ఆలయ ప్రాంగణం ప్రతిధ్వనించింది.

### దశదిన కార్యక్రమంలో పాల్గొన్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం





**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 17:**రామన్నపేట మండలం దుబ్బాక గ్రామానికి చెందిన గుండాల సోమయ్య  ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి దశదిన కర్మకు హాజరై చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చిన.,లిబి నకిరేకల్ ఎమ్మెల్యే  వేముల వీరేశం ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

### నందిగామలో వాహనాలను తనిఖీ చేసిన సీఐ



**తొలి అక్షరం/నందిగామ,నవంబర్ 17**నందిగామ మండల కేంద్రంలోని బైపాస్ మేకగూడా రోడ్డుపై వాహనాలను సీఐ ప్రసాద్, ఎస్సైలు దేవరాజ్,  యాదయ్య సోమవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాద్ మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని అన్నారు. మైనర్లకు వాహనాలను తల్లిదండ్రులు ఇవ్వవద్దని, అలాగే సరైన పత్రాలు లేని వాహనాలను, నంబర్ ప్లేట్లు లేకుండా రోడ్డు పై నడిపిస్తే సీజ్ చేస్తామని తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని, వాహనాలకు ఉన్న పెండింగ్ చలాన్లు కట్టివేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రీరాములు, ముఖీద్, బాలకృష్ణ రమేష్, రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఇందిరమ్మ ఇండ్లు.

### -టిపిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి.



వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో  దశాబ్ద కాలంగా నిరీక్షించిన నెరవేరని కల. ప్రజాపాలనలో ఇందిరమ్మ ప్రభుత్వంలో నిరుపేదల సొంతింటి కల నెరవేరుస్తున్న తరుణం టీపీసీసీసభ్యులుసొంటిరెడ్డిరంజిత్ రెడ్డి నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావులహరీష్ రెడ్డి నెక్కొండమండలం సూరిపల్లి గ్రామనికి చెందిన సోల్లెటి జయమ్మ-విజయ్ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న సందర్భంగా గృహప్రవేశం కార్యక్రమనికి ముఖ్య అతిథులు గా హాజరై రిబ్బన్ కట్ చేసి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలియచేసిన టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,సూరిపల్లి సొసైటీ చైర్మన్ గంట దామోదర్ రెడ్డి,నెక్కొండ మండల అధ్యక్షులు బక్కి అశోక్ డీసీసీ ప్రధాన కార్యదర్శి పెండ్యాల హరిప్రసాద్ ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు వర్కింగ్ ప్రెసిడెంట్ మాదటి శ్రీనివాస్ పట్టణ అధ్యక్షులు ఇదునూరి  సాయికృష్ణ కోశాధికారి కేవీ సుబ్బారెడ్డి రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి,మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి సూరిపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు మందుల కవిరాజ్ రాచకొండ వెంకన్న పోశాల సుధాకర్ రాజు నవీన్ ఉపేందర్ కట్టయ్య సంతోష్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### జర్నలిస్ట్ కుటుంబానికి

### 50 కేజీల బియ్యం పంపిణీ.



**తొలిఅక్షరం / నెక్కొండ మండలం నవంబర్ 17.**రంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని నాగారం గ్రామ వాస్తవ్యులు ప్రజాదర్బార్ మండల జర్నలిస్ట్ పొనకంటి రమేష్  తండ్రి పొనకంటి చెన్నమల్లు ఇటీవల మరణించారు. అట్టి విషయాన్ని తెలుసుకున్న నర్సంపేట తెరాస మాజీ శాసన సభ్యులు పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి, ఆదేశాల మేరకు, సొసైటీ డైరెక్టర్ కేతిరెడ్డి లక్ష్మీ శ్యామ్ రెడ్డి చొరవతో, నాగారం తెరాస గ్రామ శాఖ అధ్యక్షులు కేతిరెడ్డి శ్యామ్ రెడ్డి నేతృత్వంలో జర్నలిస్ట్ కుటుంబానికి మానవత దృక్పథంతో 50 కేజీల బియ్యం పంపిణీ చేసి మానవత్వం చాటుకుని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.  వారి వెంట తెరాస మాజీ ఉప సర్పంచ్ అటికె సుభద్ర బీరస్వామి, మాజీ వార్డు సభ్యులు తెప్ప సహదేవ్ సీనియర్ నాయకులు ఉంద్రాతి నాగయ్య, ఎమ్మ బాలకట్టయ్య, పిట్టల రమేష్, పొనకంటి వెంకటయ్య, పొనకంటి స్వామి, దుర్గం వెంకన్న, కరెంట్ హెల్పర్ ఉంద్రాతి గోపాల్ కుటుంబ సభ్యులు పొనకంటి వెంకన్న  ఉన్నారు.

# జాతీయ "బీసీ జనసేన"కు గ్రీన్ సిగ్నల్

**బీసీ జనసేన జాతీయ అధ్యక్షుడిగా కత్తి చంద్రశేఖరప్ప**

**బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు ఆర్ కృష్ణయ్య ఉత్తర్వులు జారీ**

**బీసీ హక్కుల కోసం నూతన ఉద్యమ ప్రారంభం**

**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 17**షాద్ నగర్ నియోజకవర్గ "బీసీ జనసేన" ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. బీసీ జనసేన ఏర్పాటు కోసం జాతీయ అధ్యక్షుడిగా పేరును బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. షాద్ నగర్ కు చెందిన బీసీ నేత కత్తి చంద్రశేఖర అప్పను బీసీ జనసేన జాతీయ అధ్యక్షుడిగా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బీసీ నాయకుల ఆధ్వర్యంలో హైదరాబాద్ విద్యానగర్‌లో జాతీయ బీసీ జనసేనను నూతనంగా ఏర్పాటు చేయడం జరిగింది. హైద్రాబాద్ విద్యానగర్



జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య మరియు బీసీ యువ నాయకుడు డా. అరుణ్ బాబు సంఘాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ జనసేన జాతీయ అధ్యక్షులుగా కె. చంద్రశేఖర్ ని నియమిస్తూ ఆర్. కృష్ణయ్య అనుమతి పత్రం అందజేశారు. ఈ నూతన వేదిక ద్వారా దేశవ్యాప్తంగా బీసీ వర్గాల సమస్యలు, హక్కులు, అవకాశాల కోసం ఒక బలమైన ఉద్యమం ప్రారంభమవుతున్నదని నాయకులు పేర్కొన్నారు. బీసీల



హక్కుల కోసం, న్యాయపోరాటం కోసం నేను నిరంతరం శ్రమిస్తాను" అని నూతనంగా నియమితులైన జాతీయ అధ్యక్షులు కె. చంద్రశేఖర్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కత్తి చంద్రశేఖర్, జమాల్పూర్ చందూలాల్, గడ్డమీది రమేష్, జువ్వ సుధాకర్, తంగడపల్లి శంకర్, మేకల వెంకటేష్, జూపల్లి చంద్రశేఖర్, ఆవుల ఆంజనేయులు, తోట మహేందర్ జక్కుల జలజ, స్రవంతి మరియు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా

# మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి -గండ్ర సత్యనారాయణ రావు

**మండలవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం%-% అధికారులకు ముందుజాగ్రత్త చర్యలపై స్పష్టమైన ఆదేశాలు**

**తొలిఅక్షరం(నవంబర్18)భూపాలపల్లి:**రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన గణపురం మండలంలోని ధర్మరావుపేట, ుద్దారం,గణపురం,కొత్తపల్లి గ్రామాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు, సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూకొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని



ముందు జాగ్రత్త చర్యలు పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. దొడ్డు రకం%-%సన్న రకం ధాన్యం వర్గీకరణలో ఎటువంటి గందరగోళం వీలుకాకుండా క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తి అవగాహనతో పనిచేయాలని అన్నారు. రైస్‌మిల్లర్లు 'తాలు' పేరుతో రైతులకు అన్యాయం చేయకూడదని హెచ్చరిస్తూ, రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం సకాలంలో చెల్లింపులు తప్పనిసరిగా



చేయాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కొనుగోలు ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా కొనసాగించాల్సిన బాధ్యత అధికారులదేనని గుర్తు చేశారు. "రైతుల కోసం మనం ఉన్నాం%ౌ% వారికి గౌరవం, మర్యాద చూపుతూ సేవ చేయాలి" అని ఎమ్మెల్యే సత్యనారాయణ స్పష్టం చేశారు.

# ప్రజావాణి దరఖాస్తులకు వేగవంతమైన పరిష్కారం అవసరం- కలెక్టర్ ఆదేశాలు

**ప్రతి సోమవారం స్వీకరించే అర్జీలను వెంటనే శాఖలకె పంపాలిబీ జీరో పెండింగ్ లక్ష్యంగా ముందుకు సాగాలిలిలి"**

**తొలి అక్షరం (నవంబర్18)భూపాలపల్లి:**ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని దూర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి తమ సమస్యలను తెలియజేస్తున్న నేపథ్యంలో, వారు సమర్పించిన దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండకూడదని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రజావాణి నిర్వహించిన కలెక్టర్, ప్రజల నుండి వచ్చిన వినతిపత్రాలను స్వయంగా స్వీకరించి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చడం ప్రభుత్వ బాధ్యతేనని, అందుకే ప్రతి అర్జీపై



తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తును వెంటనే సంబంధిత శాఖలకు పంపుతున్నామని, తదుపరి ప్రజావాణి వచ్చేంత వరకు ఎటువంటి దరఖాస్తూ పెండింగ్‌లో ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి సోమవారం ప్రజావాణి అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించి అర్జీల పరిష్కార గతి నివేదించాల్సి



ఉంటుందని కలెక్టర్ అన్నారు. ప్రజా సమస్యలపై అధికారులు అలర్ట్‌గా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి%-% హాజరు ఆధారంగానే వేతనాలు: కలెక్టర్ రాహుల్ శర్మ

**సకాలంలో హాజరు, పర్యవేక్షణపై శాఖాధికారులకు స్పష్టమైన ఆదేశాలు నిర్లక్ష్యంపై చర్యలు తప్పవన్న కలెక్టర్**

**తొలి అక్షరం (నవంబర్18)భూపాలపల్లి:**అన్ని శాఖల అధికారులు, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు విధానంపై అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం



నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతి కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేయబోతున్నామని, హాజరు నమోదును ఆధారంగా తీసుకుని మాత్రమే వేతనాలు చెల్లించే వ్యవస్థను అమల్లోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. హాజరు విషయంలో నిర్లక్ష్యం కనబడితే, సంబంధిత శాఖాధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సమయపాలన పాటిస్తూ, ప్రతి శాఖ అధికారులు బయోమెట్రిక్ హాజరు పర్యవేక్షణను కఠినంగా అమలు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జయ జయ శంకర

# శివనామ స్మరణతో హోరెత్తిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం.

**-కార్తీక చివరి సోమవారం భక్తులతో కిటకిట**

**-విశేష కైంకర్యములతో ఆధ్యాత్మిక శోభ.**

**తొలిఅక్షరం /  నెక్కొండ మండలం నవంబర్ 17.**

వరంగల్ జిల్లా  నెక్కొండలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక చివరి సోమవారం భక్తుల సందడి నెలకొంది. భక్తుల శివనామస్మరణతో ఆలయం హోరెత్తింది. జయ జయ శంకర.. హర హర శంకర , ఓం నమఃశ్శివాయ.. అంటూ భక్తులు పులకించిపోయారు. కార్తీక మాసంలో చివరి సోమవారం కావడంతో అధిక సంఖ్యలో విచ్చేసి విశేష పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు బివిఎన్ శాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం నుండి రుద్రాభిషేకాలు సాగాయి. అన్నపూజతో ... ఆధ్యాత్మిక శోభ పరమశివుడికి ప్రీతిపాత్రమైన కార్తీక చివరి సోమవారం రోజు అన్న పూజా నిర్వహించారు. తొనుగోరు కిషన్ పద్మ దంపతులు అన్న పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు పులిహోర ప్రసాదం కైంకర్యం




నిర్వహించి పంపిణీ చేశారు.

అర్ధనారీశ్వరుడిగా.. దర్శనం

నెక్కొండలోని శ్రీ రామలింగేశ్వర స్వామి వారు కార్తీక చివరి సోమవారం రోజున భక్తులకు అర్ధనారీశ్వర అలంకారంలో దర్శనమిచ్చారు. భవాని శంకరులతో అర్ధనారీశ్వర తత్వాన్ని ప్రతిబింబించేలా భక్తులు స్వామి వారిని అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి డైరెక్టర్ హైమా శ్రీనివాస్, వేద జ్యోతిష పండితులు బూరుగుపల్లి శ్రావణ్ కుమార్ శాస్త్రి



చైతన్య, సొసైటీ చైర్మన్ మారం రాము, మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, బొల్లం పూర్ణచందర్ రాధిక, గందె నాగలింగరాజు సుచరిత,గుమ్మడవల్లి లక్ష్మీనారాయణ స్వరూప దంపతులతో పాటు పలువురు శ్రీ రామలింగేశ్వర స్వామి సేవాసమితి ప్రతినిధులు, భక్తులుపాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే సొసైటీ లక్ష్యం : పిఎసిఎస్ చైర్మన్ జడ రాములు యాదవ్




తొలి అక్షరం/ మిర్యాలగూడ/ నవంబర్ 17సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలు సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘం పరిధిలో 2,356 మంది సభ్యులు ఉన్నారని, వారికి స్వల్పకళిక, దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నామన్నారు. సంఘం ద్వారా ఎరువులు, విత్తనాలు సకాలంలో అందిస్తున్నామన్నారు. దానితోపాటు అమ్మకాల ద్వారా రైతులకు లాభాలు అందించే దిశగా సంఘం నడుస్తుందన్నారు. సమస్యలను అధిగమించి విత్తనాలు, ఎరువులు రైతుల ఇబ్బందులు పడకుండా చేశామన్నారు. సహకార సంఘం ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా మార్కెటింగ్ చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది అన్నారు. దానికోసం 2000 రూపాయల వాటా దానం చెల్లించినట్లయితే సంఘానికి కేంద్ర ప్రభుత్వం నిధులు చెల్లించి రైతులు పండించిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడానికి అవకాశం కల్పిస్తుంది అన్నారు. అనంతరం రైతులకు ఎరువులు పొందడానికి గుర్తింపు కార్డులు అందజేశారు. దీని ద్వారా ఎరువులు పక్కదారి పట్టకుండా ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కిషోర్ నాయక్ ,ఏ ఈ ఓ నితిన్ నాయక్, మాజీ చైర్మన్ జె రాములు గౌడ్ ,వైస్ చైర్మన్ వల్లపు దాసు పద్మ ,డైరెక్టర్లు శంకర్ రెడ్డి, మాధవరెడ్డి, సీఈవో రవీందర్రావు, సిబ్బంది యాదగిరి ,శేఖర్ ,నాగరాజు, గిరి, జీవన్ కుమార్ ,సురేంద్ర చారి, రైతులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఉప్పల లక్ష్మణ్.



తొలిఅక్షరం / నెక్కొండ మండలం నవంబర్ 17. వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని నాగారం గ్రామంలో పేదలకు అత్యవసర సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు ఎంతగాని ఉపయోగపడతాయని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఉప్పల లక్ష్మణ్ అన్నారు. ఈ సందర్భంగా నెక్కొండ మండలంలోని నాగారం గ్రామ వాస్తవ్యులకు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఉప్పల లక్ష్మణ్ చేతుల మీదుగా కేతిరెడ్డి నరసింహారెడ్డి కి 25000 రూ, రామ్మడుగు సత్యనారాయణ కు 50000 రూ, కంచ ఐలయ్య కు 12000 రూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సంబధిత లబ్ధిదారులకు అందజేశారు. వారి వెంట మాజీ వార్డు సభ్యులు నాంపల్లి శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ జమ్ముల సోమయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సింగం శ్రీనివాస్, సీనియర్ నాయకులు చిదురాల సంపత్ రెడ్డి, తాళ్ళపెల్లి సాంబయ్య, మిరాల మల్లయ్య, కూరపాటి సాంబయ్య, సింగం సత్తయ్య తదితరులు ఉన్నారు.

## రామప్పలో కార్తీక శోభ భక్తుల ప్రత్యేక పూజలు, భజనలు



తొలి అక్షరం ములుగు నవంబర్ 17 :కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాత ములుగు జిల్లాలోని వెంకటాపు ర్ లో రామప్ప దేవాలయంలో సోమవారం భక్తులు పోటెత్తారు. శ్రీ రామలింగేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో నిలబడ్డారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ లు శివలింగానికి అభిషేకాలు, అలంకారాలు, ప్రత్యేక ఆర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కమీషనర్ దేవాదాయ, ధర్మాదాయ హైదరాబాద్ వారి ఉత్తర్వుల మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి బిల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తి గీతాల భజన కార్యక్రమం ఏర్పాటు చేయగా భక్తులు పాల్గొని భక్తి గీతాలను ఆలపించారు.

ఆలయ ప్రాంగణంలో భక్తి మయంగా భజనలు, శివుని నామస్మరణం సందడి చేసింది. స్వామివారి సన్నిధిలో భక్తులు దీపారాధన చేస్తూ తమ కోరికలు తీర్చమని వేడుకున్నారు. కార్తీక సోమవారం కావడంతో భక్తుల రద్దీ సాధారణ రోజులతో పోలిస్తే ఎక్కువగా కనిపించింది. ఆలయ పరిసరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టూరిజం పోలీసులు విధులు నిర్వహించారు. కార్తీక మాసం ముగింపు వేళ రామప్పలో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సిబ్బందిలు, టూరిస్ట్ పోలీసులు, గైడ్స్, భక్తులు పాల్గొన్నారు.

## వృద్దులు, వికలాంగుల సంక్షేమం కోసం పకడ్బందిగా చట్టాలు అమలు లీగల్ సెల్ ప్యానల్ లాయర్ బి.డేవిడ్



తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 17:యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామం సోమవారం నాడు వృద్దులు, వికలాంగుల కోసం చట్టాలు పకడ్బందీగా అమలు జరుగుతున్నాయని లీగల్ సర్వీసెస్ ప్యానల్ లాయర్ బి.డేవిడ్ అన్నారు. మండలంలోని కక్కిరేణి గ్రామ పంచాయితీ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాలనుసారం, మండల న్యాయ సేవా అధికార సంస్థ రామన్నపేట అధ్వర్యంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి ఉమ శంకర్ సమక్షంలో పేరెంట్స్ మరియు సీనియర్ సిటిజన్ యాక్ట్ -2007 ఉద్దేశించి లీగల్ సెల్ ప్యానల్ లాయర్ బి.డేవిడ్, సభ్యులు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలంలు కలిసి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం నందు ప్రజలకి వృద్దులు, వికలాంగుల చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు పిల్లలు, బాల బాలికలు కార్మిక చట్టాలు, పొక్సో చట్టం, బాల్య వివాహాలు, గృహ హింసా చట్టం, మహిళల రక్షణ, సంరక్షణ వంటి అనేక చట్టాలు ఉన్నాయని ప్రతి వ్యక్తి అన్ని చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు.ఎలాంటి సమస్యలు ఉన్న లీగల్ సర్వీసెస్ సేవలు వినియోగించుకావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వేముల సైదులు, గ్రామస్తులు పిట్ట సోమిరెడ్డి, సోమనబోయిన ఆదినారాయణ, సోమేశ్వర రావు, చింతం శ్రీనివాస్, కొంపల్లి అనిత, వంశీ, నర్సింహ, కిషన్ అంజయ్య, కవిత, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## వైద్యసంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ నిబంధనలు పాటించాలి - కలెక్టర్





తొలిఅక్షరం (నవంబర్18)భూపాలపల్లి: జిల్లాలోని వైద్యసంస్థలు ప్రజలకు పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించాలంటే ప్రతి ఆరోగ్యసంస్థ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జరిగిన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, డయగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ కేంద్రాలు, క్లినిక్స్ నమోదు మరియు పునరుద్ధరణ ప్రక్రియలను ఈ సమావేశంలో సమీక్షించారు.రోగుల భద్రత, వైద్య నైతిక విలువలు, అవసరమైన సిబ్బంది, పరికరాలు, ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా లేదో సంబంధిత అధికారులతో ఖచ్చితంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్న ఆసుపత్రులు, లాబ్స్ లేదా స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.దరఖాస్తులు సమర్పించిన కేంద్రాల పరిశీలనను వేగవంతం చేసి త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలన్నారు. పోలీస్, వైద్య, పంచాయతి, మున్సిపల్, ఐఎంఏ ప్రతినిధులతో సంయుక్తంగా ప్రత్యేక టీములను ఏర్పాటు చేయాలని, ఆ టీములు నిర్ణీత ప్రొఫార్మా ప్రకారం తనిఖీ నివేదికలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎఎస్పీ నరేష్ కుమార్, జిల్లా వైద్యాధికారి డా. డా.మధుసూదన్, ఐఎంఏ అధ్యక్షులు డా. కిరణ్, మారి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు సదానందం

## భూపాలపల్లిలో ఇండియా బ్యాంక్ కొత్త శాఖ ప్రారంభం

### లిజిల్లా ప్రజలకు ఆధునిక బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ -కలెక్టర్ రాహుల్ శర్మలిలి



తొలి అక్షరం(నవంబర్18)భూపాలపల్లి:జిల్లా ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం మంజూరునగర్లో నూతన ఇండియా బ్యాంక్ శాఖను ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన ఇండియా బ్యాంక్ జిల్లాలో కొత్త శాఖను ప్రారంభించడం ద్వారా వ్యాపారులు, రైతులు,సాధారణ ప్రజలకు ఆర్థిక కార్యకలాపాలు నిర్వహణలో మరింత సౌలభ్యం ఏర్పడుతుందని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద రుణాలు, సబ్సిడీలు మరియు ప్రాధాన్యత రంగాలకు సంబంధించిన సేవలు ఇప్పుడు ప్రజలకు వేగంగా అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.బ్యాంక్ సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా, స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ సేవా నాణ్యతను పెంపొందించాలని సూచించారు. ఆధునిక బ్యాంకింగ్ సదుపాయాలతో ఈ శాఖ జిల్లా ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఎల్డిఎం తిరుపతి, ఫీల్డ్ జనరల్ మేనేజర్ ప్రాణేష్ కుమార్, డిప్యూటీ జోనల్ మేనేజర్ కేశవరావు, జోనల్ మేనేజర్ సుధాకర్ రావు, భూపాలపల్లి శాఖ మేనేజర్ ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గోడ పత్రికను ఆవిష్కరించిన మన ముదిరాజ్ సంఘం



తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 17:తెలంగాణ మన ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు భువనగిరి ఎల్లయ్య ఆధ్వర్యంలో సోమవారం రోజున మోటకొండూరు మండల కేంద్రంలో ఈనెల 21వ తేదీన జరుపుకొను ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం. మరియు తెలంగాణ మన ముదిరాజ్ సంఘం ఆవిర్భావ దినోత్సవం గోడ పత్రికను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మన ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు జోరుక ఎల్లేష్ ముదిరాజ్ , మోటకొండూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు మారబోయిన శ్రీనివాస్ ముదిరాజ్, వైస్ చైర్మన్ గిరబోయిన మల్లయ్య ముదిరాజ్, చాడ మత్స్య పారిశ్రామిక సొసైటీ అధ్యక్షులు గుర్రాల మల్లయ్య ముదిరాజ్, చాడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు గుర్రాల కిష్టయ్య ముదిరాజ్, కార్యదర్శి చొప్పరి సోములు ముదిరాజ్ పాల్గొన్నారు. చాడ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు దొంతి శ్రీనివాస్ ముదిరాజ్, దిలావర్పూర్ మత్స్య సొసైటీ అధ్యక్షులు సొప్పరి మారయ్య ముదిరాజ్, బరిగెల నరసింహ ముదిరాజ్, ఇట్టబోయిన నరసింహ ముదిరాజ్, తాడబోయిన శ్రీను ముదిరాజ్, గిరబోయిన మల్లయ్య ముదిరాజ్, బరిగెల గణేష్ ముదిరాజ్, బొల్ల శ్రీను ముదిరాజ్, మారబోయిన జాంగిర్ ముదిరాజ్, దొంతర పోయిన దేవేందర్ ముదిరాజ్, బరిగల యాదయ్య ముదిరాజ్, బరిగల వీరయ్య ముదిరాజ్ తదితర ముదిరాజ్ కుటుంబ సభ్యులు మత్స్య సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## తమ్ముడి ప్రేమకు సహకరించాడనే హత్య చేశారు

**ఇన్నోవా కారులోనే రాజశేఖర్ హత్య..!**

**నవాబుపేట అడవి ప్రాంతంలో శవ దహనం**

**రాజశేఖర్ హత్య కేసులో కీలక ఆధారాల సేకరించిన షాద్ నగర్ పోలీసులు**

**ఏడు మంది హంతకుల అరెస్ట్ - ఒకరు పరారీ**

**షాద్ నగర్ పోలీసుల అదుపులో ఇన్నోవా వాహనం**

**రాజశేఖర్ హత్య కేసులో ప్రధాన నిందితుడు వెంకటేష్ వద్ద "మీడియా ప్రెస్ ఐడి కార్డు"**

**ఒక ప్లాస్టిక్ డబ్బాలో ఆరు లీటర్ల పెట్రోల్, నైలాన్ తాడు కొనుగోలు చేసిన హంతకులు**




తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 17దళిత యువకుడు రాజశేఖర్ కిడ్నాప్ హత్య ఉదాంతంలో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పోలీసులు కేసులో పురోగతి సాధించారు. రాజశేఖర్ ను హతమార్చి శవాన్ని దహనం చేసిన ఘటనలో పోలీసులు ఎనిమిది మందిని హంతకులుగా గుర్తించారు. ఇందులో సోమవారం ఏడు మందిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు షాద్ నగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్ లక్ష్మీనారాయణ, పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఎర్ర రాజశేఖర్ ను హత్య చేసిన వారిలో ప్రధాన నిందితుడు ఎల్లంపల్లి గ్రామానికి చెందిన కాగుల వెంకటేష్, మరో ట్రాక్టర్ డ్రైవర్ పత్తి శీను, వికారాబాద్ జిల్లా పూడూరు గ్రామానికి చెందిన వడ్డే నర్సింలు, బాలనగర్ మండలం గౌతాపూర్ గ్రామానికి చెందిన గణేష్, మొయినాబాద్ మండలం నజీబ్ నగర్ గ్రామానికి చెందిన సోమ సురేష్ అలియాస్ సోమచంద్ కుమార్, రంగంపల్లి గ్రామానికి చెందిన బిజ్జ రాఘవేందర్, మరో డీసెంట్ డ్రైవర్ ఆవుల శ్రీకాంత్, కానుగుల రాములు మొత్తం ఎనిమిది మంది ఈ హత్యలో పాల్గొన్నట్లు పోలీసులు ధృవీకరించారు. ఇందులో గణేష్ పరారీలో ఉండగా మిగతా ఏడు మందిని అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించినట్లు సిఐ విజయ్ కుమార్ తెలిపారు. ఈనెల 12వ తేదీన రాత్రి 11 గంటల సమయంలో హత్య గురైన రాజశేఖర్ భార్య ఎర్రవాణి వెంకటేష్ అలియాస్ వెంకటయ్య అనే వ్యక్తి మరో ముగ్గురు కలిసి తమ ఇంటి దగ్గరకు వచ్చి తన భర్తను ఇంటి నుండి బయటకు పిలిచి మాట్లాడదామని చెప్పి తనకు సమాచారం ఇవ్వకుండా అతన్ని తీసుకువెళ్లిపోయారని కిడ్నాప్ చేశారని ఆమె పోలీసులకు పేర్కొన్నట్లు తెలిపారు. గతంలో తన భర్త సోదరుడు చంద్రశేఖర్ భవాని ఇరువురి మధ్య ప్రేమ వ్యవహారంలో మొయినాబాద్ పోలీస్టేషన్లో కేసు నమోదు అయిందని తన మరిది తక్కువ కులం వాడు కావడంతో ఇది చూసి భవాని తండ్రి వెంకటయ్య సిగ్గుపడ్డాడని రాజశేఖర్ చంద్రశేఖర్ కు మద్దతు ఇస్తున్నాడని అతని ఎలాగైనా చంపాలని వెంకటేష్ నిర్ణయించుకున్నాడని తెలిపారు. రాజశేఖర్ ను ఈనెల 12వ తేదీన కిడ్నాప్ చేసి ఇన్నోవా కార్ లో ఎక్కించుకొని అన్నారం జంక్షన్ వైపు వెళ్ళిపోయారు. ఇన్నోవా కారులోనే రాజశేఖర్ గొంతు కోసి చంపారు మెడకు తీసుకువచ్చిన నైలాన్ తాడుతో రెండువైపులాగా ఈ సమయంలో కొందరు అతని కాళ్ళను పట్టుకొని హత్యకు సహకరించారని పోలీసులు తెలిపారు. ఆ తర్వాత ఇన్నోవా కారులో రామేశ్వరం వైపు వెళ్లి నవాబుపేట సరిహద్దులకు వెళ్లి ఒక నిర్మానుష ప్రదేశంలో రాజశేఖర్ మృతదేహాన్ని దించి తమ వెంట తెచ్చుకున్న ప్లాస్టిక్ క్యాన్లు 6 లీటర్ల పెట్రోలు మృతదేహం పై పోసి అగ్గిపెట్టతో నిప్పంటించినట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

ఈ మొత్తం వ్యవహారంలో పోలీసులు ఏడు మందిని అదుపులోకి తీసుకొని రిమాండ్కు తరలిస్తున్నట్లు ప్రకటించగా వీరి వద్ద రెండు బైకులు 2 కార్లు అదేవిధంగా 6500 రూపాయల నగదు, ఒక సెల్ ఫోన్ ఇన్నోవా కార్ ఆర్ సి వెంకటేష్ కు సంబంధించిన ఒక ప్రెస్ ఐడీ కార్డు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు శంషాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజేష్ ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిందని తెలిపారు. షాద్ నగర్ ఎసిపి ఎస్ లక్ష్మీనారాయణ, సీఐ విజయకుమార్, ఎస్ఐ శరత్ కుమార్ పోలీసు సిబ్బంది తదితరులు ఈ కేసులో నిందితుల గుర్తింపు కోసం చురుగ్గా పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు వీరికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ తగిన రివార్డులను అందజేస్తారని వారు పేర్కొన్నారు.

## వలిగొండ మండలం సుంకిశాల గ్రామానికి. భువనగిరి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి,



తొలి అక్షరం:వలిగొండ, నవంబర్, 17. వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ప్రతి సంవత్సరం శ్రీ వెంకటేశ్వర స్వామి, కళ్యాణ మహోత్సవం జరుగుతాయి, ఈ కళ్యాణ మహోత్సవం కి నేను పాల్గొనడం, చాలా సంతోషంగా ఉందని, అలాగే భక్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి, దర్శనం చేసుకున్నారని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, ఈ సందర్భంగా తెలియజేశారు.

## రన్ ఫర్ సోషల్ జస్టిస్.




తొలి అక్షరం:వలిగొండ, నవంబర్ 17. ఉదయం మార్నింగ్ వాకర్స్ తో వలిగొండ న్యూ బస్టాండ్ నుండి హైస్కూల్ వరకు మార్నింగ్ వాక్కు నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో బీసీ సంఘం మండల అధ్యక్షులు సాయిని యాదగిరి మాట్లాడుతూ బీసీలకు విద్య ఉద్యోగ రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఇందుకోసం రాజ్యాంగాన్ని సవరించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచడానికి తెలంగాణ రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు వలిగొండ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో బీసీ సంఘం టౌన్ అధ్యక్షులు నానచర్ల రమేష్ బీసీ సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పబ్బు సురేందర్ కాసుల వెంకటేశం పబ్బు వెంకటరమణ బత్తిని బిక్షపతి పబ్బు శివ మారగోని బాలయ్య కొడి కృష్ణ మార్నింగ్ వాకర్స్ లో పాల్గొన్నారు.

## చందేపల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు



తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 17:యాదాద్రి భువనగిరి జిల్లా మోటాకోండూర్ మండలం చందేపల్లి గ్రామంలో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం శివాలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం దీపోత్సవ కార్యక్రమాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుదగాని జయరాములు గౌడ్, శివాలయం ఆలయ అర్చకులు ఆకుల కోటేశ్వర్, భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు

తొలి అక్షరం దంతాలపల్లి నవంబర్ 17: దంతాలపల్లి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో సోమవారం తాసిల్దార్ సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తప్పక ధాన్యం కొనుగోలు కేంద్రానికి పండించిన ధాన్యమును తీసుకురావాలని మధ్య దళారులకు దాన్యమును అమ్మకూడదని సూచించారు ఈ కార్యక్రమంలో ఏవో వాహిని ఏఈఓ దీక్షిత్ శిరీష ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బారసాల వేడుకల్లో పాల్గొన్న శశిధర్ రెడ్డి ఫౌండేషన్ చైర్ పర్సన్ కంది చంద్రకళ వెంకట్ రాంరెడ్డి



తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 17:యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో నమస్తే తెలంగాణ రిపోర్టర్ మానెగల్ల విక్రమ్ ప్రవళిక ముదిరాజ్ కూతురి బారసాల వేడుకలు వారి స్వగృహంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కంది శశిధర్ రెడ్డి ఫౌండేషన్ చైర్ పర్సన్ కంది చంద్రకళ వెంకట్ రాంరెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో సాక్షి రిపోర్టర్ లోడే చంద్రశేఖర్, క్యూ న్యూస్ , శనార్తి తెలంగాణ రిపోర్టర్ గుర్రాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.